


T/TG/2024/0523/7229/1544

# ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక




పబ్లిష్ : తెలంగాణ | శుక్రవారం 20 -06-2025 | సంపుటి : 01 సంచిక :191 | ఎడిటర్ : పెనుగొండ సతీష్ | పేజీలు : 08 | వెల : 05 రూ /-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham,nijambad, rajana sirisilla



# మెట్రో రెండోదశకు అనుమతించండి

మిగతాది 2 లో...

## బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తోనూ చర్చలు

- హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యకు ఇదే పరిష్కారం
- 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 డిపిఆర్ అందించాం
- కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి వినతి

**న్యూఢిల్లీ,జూన్19(ఆకాంక్ష ):** మెట్రో రెండోదశకు వెంటనే అనుమతులు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో ఆయన నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సమావేశం అయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 అవసరం ఎంతో ఉందని కేంద్ర మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు సీఎం. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. మెట్రో ఫేజ్-2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా కొనసాగడంతో పాటు రహదారులపై రద్దీ కూడా తగ్గుతుందని వెల్లడించారు. అలాగే, సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర మంత్రి ఖట్టర్ కు





## జిల్లా ఎస్పీ ముందు 12 మావోల లొంగుబాటు

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్19(ఆకాంక్ష ):** జిల్లా పోలీసులు, 81 అండ్ 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధిసంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ కల్పిస్తున్న సదుపాయాలను గురించి తెలుసుకొని నక్సలిజాన్ని విడనాడి ఇకపై తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని, నిర్ణయించుకొని వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 12 మంది నిషేదిత మావోయిస్టు పార్టీ సభ్యులు గురువారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. జిల్లాలో ఈ

మిగతాది 2 లో...

## కేబినేట్ నిర్ణయించకుండా పనులు చేపడతారా

సిఎం రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా

కాళేశ్వరం కూడా కేబినేట్ నిర్ణయం మేరకే జరిగింది

ప్రాజెక్టులు కట్టడం వేరు..అవినీతి చోటు చేసుకోవడం వేరు

అందుకే కాళేశ్వరం అవినీతిపై సిబిఐ విచారణను కోరుతున్నాం

సిఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి ఈటెల రాజేందర్ వ్యాఖ్య

**హైదరాబాద్,జూన్19(ఆకాంక్ష ):** సుందిళ్ళ, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులు రీ డిజైన్ లో కేసీఆర్ చేర్చారు.. అవినీతి జరిగితే విచారణ జరపండి, విచారణ జరిగినా చర్యలు తీసుకుంటారాని నమ్మకం లేదు, అందుకే సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తునామని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు ఏటిఎంలుగా మారాయని ఎంపీ ఈటల తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా కేబినెట్‌లో ఆమోదం

మిగతాది 2 లో...



## ఎల్‌బి స్టేడియంలో నేడు యోగా

ఏర్పాట్లను పరిశీలించిన కిషన్ రెడ్డి



**హైదరాబాద్,జూన్19(ఆకాంక్ష ):** అంతర్జాతీయ యోగా దినోత్సవం-2025ను పురస్కరించుకుని ఎల్బీ స్టేడియంలో ఉక్కు మరియు బొగ్గు, గనుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 5:30 గంటలకు ప్రారంభమయ్యే 24 గంటల కౌంట్‌డౌన్ వేడుకలకు భారీ ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ, భద్రత, సదుపాయాలు, వేదిక ఏర్పాట్లపై అవసరమైన సూచనలు చేశారు. 21వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా యోగ దినోత్సవ వేడుకలు జరగబోతున్నాయని తెలిపారు. భారత ప్రభుత్వం తరపున, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున దేశంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం.. విశాఖపట్నం వేదికగా యోగా కార్యక్రమాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. అయితే, 24 గంటల కౌన్ డౌన్ పేరుతో శుక్రవారం ఉదయం యోగ పండుగ నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కేంద్ర

మిగతాది 2 లో...

## బేసిన్ల మీద అవగాహన లేకుంటే ఎలా

- దేవాదుల ఏ బేసిన్ కింద ఉందో కూడా తెలీదా
- బనకచర్లపై పక్కదోవ పట్టించేలా మాట్లాడుతారా
- సిఎం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్,జూన్19(ఆకాంక్ష ):** ఆంధ్రా జల దోపిడీని అడ్డుకుని.. తెలంగాణ పొలాలకు నీళ్లు పారియ్యమని, అక్రమ ప్రాజెక్టును ఆపమని అడిగితే.. అది చేతగాక అడ్డుఅదుపు లేకుండా అబద్దాల ప్రవాహాన్ని నిన్న సీఎం పారించే ప్రయత్నం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అసలు విషయం మాట్లాడకుండా.. విషయాన్ని పక్కదోవ పట్టించారు. మా ఎంపీ రవిచంద్ర బాగా ఆర్గ్యూ చేశారు. బనచకర్ల ప్రాజెక్టును ఆపేందుకు ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా సహకరిస్తుంది. దీన్ని గాంధీ భవన్‌గా, రాజకీయ వేదికగా మార్చకు. అసెంబ్లీ ఏర్పాటు చేసి ఏకగ్రీవ తీర్మానం చేయ్. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లు అని మా ఎంపీ స్పష్టంగా చెప్తే సీఎం మాత్రం రాజకీయ వేదికగా మార్చారు అని హరీశ్‌రావు

మిగతాది 2 లో...



## బనకచర్ల ప్రాజెక్టు అంశంలో అభ్యంతరాలను వివరించాం

- పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు
- కేంద్రమంత్రి పాటిల్‌ను కలిసిన సిఎం రేవంత్, ఉత్తమ్



**న్యూఢిల్లీ,జూన్19(ఆకాంక్ష ):** బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమకు ఉన్న అభ్యంతరాలను కేంద్రమంత్రికి వివరించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు పట్ల తెలంగాణ ప్రజల్లో తెలంగాణ రైతుల పట్ల ఆందోళన ఉందని, గోదావరి కృష్ణ నుంచి 1500 టీఎంసీల వాటర్ తెలంగాణకు బ్లాంకెట్ ఎన్‌వోసి ఇస్తే దాని ద్వారా కోటిన్నర ఎకరాలకు నీళ్లు అందించగలుగుతామని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు. పోలవరం , బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. బనకచర్ల లింక్ ప్రాజెక్టు చట్ట విరుద్ధమని చెప్పామని.. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. బనకచర్లపై త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి చెప్పారని, గోదావరిలో 1000

మిగతాది 2 లో...

## పర్యాటక ప్రాంతంగా చర్లపల్లి చెరువు అభివృద్ధి

చెరువు ప్రాంతాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్

**హైదరాబాద్,జూన్19(ఆకాంక్ష ):** చర్లపల్లి జైలు పరిధిలో ఉన్న చెరువుపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. దీనిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలపై చర్చించారు. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్

మిగతాది 2 లో...



ఆకాంక్ష
T/TG/2024/0523/7229/1544
తెలుగు సంచలన దిన పత్రిక
శుక్రవారం 20 - 06 - 2025
ఆకాంక్ష ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ

## బనకచర్ల ప్రాజెక్టు అంశంలో అభ్యంతరాలను వివరించాం

టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు తెలంగాణకు బ్లాంకెట్ ఎన్వోసి ఏపీ రాసివ్వాలని కోరామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. అప్పుడే తాము బనకచర్లపై ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు లభిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణం చేయాలనుకున్నా.. ప్రాజెక్టులు అనుమతులు నెమ్మదిగా అవుతున్నాయని మంత్రి అన్నారు. అయితే తమ అభ్యంతరాలపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అన్ని విధాలుగా హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మూసి పునర్జీవం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారన్నారు. తెలంగాణకు అన్యాయం జరగకుండా అన్ని విధాల చర్యలు చేపడతామని చెప్పారన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంలో వీలైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎల్‌బి స్టేడియంలో నేడు యోగా

ప్రభుత్వ అధికారులు, ప్రముఖులు, సినీ హీరోలు, సినీ తారలు, యోగ గురువులు పాల్గొంటారని చెప్పుకొచ్చారు. మైదానంలోయోగా ఎగ్జిబిషన్ ఉంటుంది.. ఉదయం 5:30 నుంచి 7:30 గంటల వరకు యోగా కార్యక్రమం ఉంటుంది.. నగర ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యాక్రమంలో పాల్గొనాలని కోరారు. మన దైనందిన జీవితంలో యోగా చాలా ముఖ్యమైంది అని కిషన్ రెడ్డి వెల్లడించారు.

## జిల్లా ఎస్పీ ముందు 12 మావోల లొంగుబాటు

ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వీరితో కలిపి మొత్తం 294 మంది దళ సభ్యులు వివిధ హోదాల్లో డీవీసీఎంలు3, ఏసీఎంలు 17, పీఎంఎస్ 34, మిలీషియం మెంబర్లు 107, పీఆర్సీ మెంబర్లు 35, డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ 47, సీఎన్ఎం మెంబర్లు 30, జీఆర్డీ మెంబర్లు 21 మంది జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందారు. ప్రస్తుతం సీపీఐ మావోయిస్టు సాయుధ దళాల సంచారం తెలంగాణ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రా ల సరిహద్దు ప్రాంతాల్లో ఉంది. ఈ సరిహద్దు గ్రామాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో మావోయిస్టు దళాలకు సహకరించకూడదని, మావోయిస్టుల సమాచారం తెలిసినట్లైతే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో కానీ లేదా జిల్లా ఉన్నతాధికారులకు కానీ తెలియజేయాలని, ఇలా ప్రజలు అందించిన సమాచారం ద్వారానే ఇటీవల ములుగు జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్టు చేయడం జరిగిందని, 12 ఆయుధాలను కూడా జప్తు చేశారన్నారు. లొంగిపోయిన వారిలో మడకం రమ అలియాస్ మడా అలియాస్ రఘు, మడకం భీమ అలియాస్ శ్రీకాంత్, పున్నం కవిత, ఓయం లక్క అలియాస్ దినేష్, తాటి భీమ, పొడియం దేవి అలియాస్ చిలుక, ముచాకి మాసా అలియాస్ సుధీర్, సోడి హుంగి, కోడి దేవ, మడకం కోసా, మడవి పాండు, సోడి ఊర ఉన్నారు.

## పర్యాటక ప్రాంతంగా చర్లపల్లి చెరువు అభివృద్ధి

సౌమ్య మిశ్రా ఆహ్వానం మేరకు చర్లపల్లి చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించారు. జైళ్లశాఖ అధికారులతోపాటు స్థానిక రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి.. 58 ఎకరాల్లో ఉన్న చర్లపల్లి చెరువు ఆధునికీకరణపై చర్చించారు. చెరువు చుట్టూ ఉన్న ఇన్ లెట్, ఔట్ లెట్‌లు పరిశీలించి.. చెరువులో నీరు పరిశుభ్రంగా ఉండటంతో జీవవైవిధ్యానికి అవకాశం లభిస్తుందని రంగనాథ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చర్లపల్లి చెరువును పర్యాటకంగా, విహార కేంద్రంగా తీర్చిదిద్దడంతోపాటు చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కట్టను మరింత బలోపేతం చేయాలని ఇరు శాఖల అధికారులు నిర్ణయించారు. చెరువు అభివృద్ధికి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను రూపొందించాలని హైడ్రా ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగానికి రంగనాథ్ సూచించారు. హకీంపేట నుంచి నాగిరెడ్డి కుంట, కాప్రా చెరువు, దమోతుకులకుంట, బైసన్‌కుంట గొలుసుకట్టు చెరువుల ద్వారా చర్లపల్లి చెరువుకు నీరు చేరుతుంది. ఈ చెరువుకు మురుగు నీరు కలవకుండా డైవర్ట్ నాలా కూడా ఉంది. చెరువు చుట్టూ దాదాపు 3 కిలోమీటర్ల మేర నడక దారి అందుబాటులోకి వస్తుంది. చుట్టూ పాత్‌వే, మినీ పార్కులు, చెట్లు, సీటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే స్థానికులే కాకుండా విహార కేంద్రంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. చర్లపల్లి పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నట్లు సౌమ్యమిశ్రా తెలిపారు.

## ఇరాన్ అధినేత ఖొమేనీ హత్య సాధ్యమేనా?

**టెహ్రాన్,జూన్19(ఆకాంక్ష ):** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హత్య చేయాలన్న ఇజ్రాయెల్ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్డుకున్నట్లుగా ఇటీవల పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ చనిపోయిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ సైతం ఈ వార్తలను తోసిపుచ్చలేదు. సుప్రీం కమాండర్‌కు అనుకోని విధంగా ఏదైనా జరిగితే కొత్తగా బాధ్యతలు ఎవరు స్వీకరిస్తారనే చర్చ జరుగుతున్నది. ఇరాన్ రాజకీయాలు సంక్లిష్టంగా ఉన్నప్పటికీ నిపుణులు మాత్రం ఖమేనీ కుమారుడు అతని తర్వాత సుప్రీం లీడర్‌గా వచ్చేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల 30 మంది ఇరానియన్ నిపుణులతో నిర్వహించిన బీబీసీ పర్షియన్ పోల్‌లో.. అయతుల్లా అలీ ఖమేనీ రెండో తనయుడు మోజ్‌తబా తన తండ్రి బాధ్యతలను చేపడుతాడని విశ్వసిస్తున్నట్లుగా తేలింది. కానీ, ఇరాన్ సొంత వ్యవస్థ అడ్డంకిగా మారే అవకాశం ఉంది. వంశపారంపర్య వారసత్వం ద్వారా అధికారాన్ని బదిలీ చేయాలన్న ఆలోచన 'ఇస్లాం వ్యతిరేకంగా' పేర్కొన్నారు. షాను తొలగించిన అయతుల్లా రుహోల్లా ఖమేనీ.. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది రాచరికం కంటే మెరుగైంది ఏమీ కాదన్నారు. ఈ విషయంలో ఆయన ఆలోచనలు ప్రసంగాలు, ఇతర రచనలను సేకరించిన 21-సంపుటాల సముదాయం సహిఫెయే ఇమామ్ ఖమేనీలో నమోదయ్యాయి. 1989లో ఖమేనీ తర్వాత సుప్రీం నాయకుడిగా మారిన ఖమేనీ.. వంశపారంపర్య పాలన ఇస్లామిక్ వ్యవస్థకు తగదని అన్నారు. ఇరాన్‌లో అయతుల్లా రుహోల్లా ఖమేని చిత్రం ప్రతిచోటా కనిపిస్తుంది. ఇరాన్ కరెన్సీ నోట్లు.. తరగతి గదులు.. ప్రభుత్వ భవనాల్లో ఆయన చిత్రం కనిపిస్తుంది. ఆయన 1979 ఇస్లామిక్ విప్లవానికి నాయకత్వం వహించారు. పాశ్చాత్య దేశాల మద్దతు ఉన్న షాను పదవి నుంచి తొలగించారు. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 1983 నివేదికలో.. ఖమేనీ ప్రభావం లేకుండా ఈ విప్లవం సాధ్యమయ్యేది కాదని పేర్కొంది. మతం-రాజకీయాలు విడదీయరానివని ఆయన భావించేవారు. ఇస్లాం అంటే రాజకీయాలని ఆయన ఓ సారి వ్యాఖ్యానించారు. ఆయనపై షియా విశ్వాసాల లోతైన ప్రభావం కనిపిస్తుంది. ఆయన తాత సయ్యద్ అహ్మద్ ముసావికి భారత్‌తో సంబంధాలున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ పట్టణం ఆయన స్వస్థలం. 1979 ఇస్లామిక్ విప్లవానికి నాయకత్వం వహించిన ఖమేనీ తన తాత అహ్మద్ ఆధ్యాత్మిక మార్గం నుంచే ప్రేరణ పొందారు. అహ్మద్ భారతదేశం నుంచి ఇరాన్‌కు వెళ్లారు. ఖమేనీ ఆ తర్వాత ఇరాన్ దేశ మొదటి సుప్రీం నాయకుడు అయ్యాడు. ఇరాన్‌ను దైవపరిపాలనా రాజ్యంగా మార్చాడు. అహ్మద్ తన భారతీయ మూలాలను ప్రతిబింబించడానికి 'హిందీ' అనే పేరును తన పేరులో కలిపి పెట్టుకున్నాడు. అహ్మద్ 1830లో బారాబంకీని వదిలి వెళ్లాడు. ఆయన తండ్రి దిన్ అలీ షా 1700లో మధ్య ఇరాన్ నుంచి భారతదేశానికి ప్రయాణించాడు. 1800 ప్రాంతంలో జన్మించిన అహ్మద్.. మొఘల్ సామ్రాజ్యం పతనం తర్వాత భారతదేశంలో బ్రిటిష్ నియంత్రణ పెరుగుతున్న సమయంలో లక్నో నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బారాబంకీ సమీపంలోని కింటూరు గ్రామంలో పెరిగాడు. ఇస్లాంకు పునరుజ్జీవనం అవసరమని.. ముస్లింలు సమాజంలో తమ స్థానాన్ని తిరిగి పొందాలని నమ్మిన ముస్లిం ప్రముఖుల్లో ఒకడు. ఆయన షియా మత గురువు. 1800 ప్రారంభంలో భారతదేశం నుంచి ఇరాక్‌కు బయలుదేరాడు. ఆ సమయంలో పర్షియా పేరుతో పిలువబడ్డాడు. 1830లో నజాఫ్‌లోని అలీ సమాధిని సందర్శించాడు. 1834 నాటికి ఇరానియన్ పట్టణమైన ఖోమిన్‌కు వెళ్లి ఒక ఇల్లు కొనుక్కున్నాడు. అక్కడే కుటుంబాన్ని ప్రారంభించాడు. ఆయన ప్రయాణం తన మతంపై నమ్మకంతో దాన్ని వ్యాప్తి చేయాలనే కోరిక ఉండేది. ఖోమిన్‌లో ఆయన మూడుసార్లు వివాహం చేసుకున్నాడు. ఆయనకు ఐదుగురు సంతానం. వారిలో ఒకరు రుహోల్లా ఖోమినీ తండ్రి మోస్తఫా. ఆయన 1902లో జన్మించాడు. అహ్మద్ హిందీ 1869లో తుదిశ్వాస విడిచారు. ఖమేనీ పుట్టడానికి చాలా కాలం ముందే అహ్మద్ హిందీ మరణించినప్పటికీ.. కుటుంబ విలువలు, విశ్వాసం సుప్రీం లీడర్ ఖమేనీ ద్వారా ఇరాన్ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాయి.

## కేబినేట్ నిర్ణయించకుండా పనులు చేపడతారా

లేకుండా ఏమి జరగదు.. ఆయన మంత్రి వర్గంలో ఉన్నవారే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు, ఈ విషయం వారిని అడగవచ్చని సూచించారు. కేసీఆర్ మొదలు పెట్టిన ప్రాజెక్ట్ అని నేను చెప్పాను, అది ఎప్పుడు మొదలయ్యిందో తెలుసుకోవాలని పేర్కొన్నారు. అయితే, మొదట పిల్లర్లు రిపేర్ చేసి నీళ్లు ఇచ్చే పని పెట్టుకోండని రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ప్రాజెక్టులు కట్టడం తప్పు కాదు, వాటి పేరుతో అక్రమాలు చేయడం తప్పు అన్నారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రతి నిర్ణయం కేబినెట్ రాటిఫికేషన్ జరుగుతుంది.. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని డాక్యుమెంట్స్ మీకు పంపిస్తాను అని చెప్పుకొచ్చారు. మీ డిపార్ట్‌మెంటో ఏ నిర్ణయం తీసుకోవాలి అనుకున్నా.. కేబినెట్ లో పెట్టండి అని కేసీఆర్ చెప్పే వారు ఇది నిజం కాదంటే నేను దేనికైనా సిద్ధం అని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మించడం, అవినీతి వేరువేరుగా చూడాలి.. ప్రాజెక్ట్ నిర్మించాలి కానీ వాటిని అడ్డం పెట్టుకొని సంపాదించడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తుందని బీజేపీ ఎంపీ ఈటల చెప్పారు. ఇక, తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిందని ఈటల రాజేందర్ తెలిపారు. నేను జైళ్లకు పోయిన, నా రక్తం చిందిది, పెట్రోల్ మంటల్లో యువత కాలిపోయింది, ఫలితంగా వచ్చిన తెలంగాణలో ప్రాజెక్ట్ కట్టాలా వద్దా? అని ప్రశ్నించారు. అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే మొదలు పెట్టారు కానీ పూర్తిచేయలేదు.. జలయజ్ఞంలో భాగంగా ప్రాణహిత- చేవెళ్ల ఐదేళ్లలో పూర్తి చేసే ప్రాజెక్టేనా కదా?.. ఎందుకు పూర్తి చేయలేదన్నారు. కమిషన్ త్వరగా పూర్తి చేయాలి అవినీతి నిగ్గు తేల్చాలి.. బీజేపీ అయితే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుంది.. బీజేపీ ప్రాజెక్ట్స్ కట్టడానికి వ్యతిరేకం కాదు.. అధికారం అడ్డం పెట్టుకొని టెండర్లు లేకుండా పనులు పంచుకోవడం తప్పు అని ఎంపీ ఈటల పేర్కొన్నారు.

## బేసిన్ల మీద అవగాహన లేకుంటే ఎలా

మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. బహుషా బ్యాగుల మీద ఉన్న నాలెడ్జ్.. బేసిన్ల మీద లేదని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు విమర్శించారు. బేసిన్ల మీద బేసిక్ నాలెడ్జ్ లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు మీద నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు రాష్ట్ర ప్రజలు చూశారు. గత కొంతకాలంగా బనకచర్లను అడ్డుకోండని మేం మాట్లాడితే.. బొడిగుండుకు, మోకాలికి ముడిపెట్టినట్టుగా నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడారు. అసలు విషయాన్ని పక్కనపెట్టి సొల్లు వాగుడు వాగారు ముఖ్యమంత్రి. బేసిన్ల గురించి బేసిక్ నాలెడ్జ్ లేకుండా మాట్లాడారు. ఆయనకు బహుషా బ్యాగుల మీద మంచి నాలెడ్జ్ ఉన్నట్టుంది కానీ బేసిన్ల మీద నాలెడ్జ్ లేదని నిన్నటి పీపీటీతో స్పష్టమైపోయింది. పీపీటీ పెట్టి మరి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. దీంతో రాష్ట్రం పరువు పోయింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కనీసం బేసిక్ నాలెడ్జ్ లేకుండా ఉంటారా..? అని రాష్ట్ర ప్రజలు నవ్వుకునే పరిస్థితి ఏర్పడింది. సీఎం ఇంత అజ్ఞానంగా ఉంటాడా..? అని దేశం ముందు పరువు పోయే పరిస్థితి వచ్చింది. సీఎంకు, ఉత్తమ్‌కు కనీస జ్ఞానం లేకపోవడం ఈ రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం. రేవంత్ రెడ్డి అంతులేనటువంటి అజ్ఞానంతో, మూర్తీభవించిన మూర్ఖత్వంతో నిన్న మాట్లాడారు. విషాదం ఏంటంటే.. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందని రేవంత్ రెడ్డి అడుగుతాడు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలియదు.. బనకచర్ల ఏ బేసిన్‌లో కడుతున్నారో ఆయనకు తెలియదు. అసలు సీఎం రేవంత్ ఏం చేస్తున్నట్లు.? బనకచర్ల మీద ఏపీ ఆరు నెలల నుంచి పని చేస్తూ.. కేంద్ర ఆర్థిక మంత్రికి ఉత్తరాలు రాస్తూ.. కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కలుస్తూ ముందుకు పోతుంటే.. సీఎం అమాయకంగా బనకచర్ల ఏ బేసిన్‌లో ఉంది అని అడుగుతున్నాడు. దీని బట్టి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమైపోతోంది అని హరీశ్‌రావు అన్నారు. ÷శివంత్ రెడ్డి లాగా నేను విజ్ఞతను పోగొట్టుకునే వ్యక్తిని కాదు. రేవంత్ రెడ్డి కుసంస్కారి. సంస్కారం లేని వ్యక్తి. మాట్లాడితే సొల్లు.. ఎదుటి వారిమీద బురద జల్లడం, నోటికొచ్చినట్టు వదరుబోతు తనంతో మాట్లాడడం. మాకేమో కొన్ని ఎథిక్స్ ఉన్నాయి. క్యారెక్టర్‌తో ఉన్నాం. ఉద్యమాలు, పోరాటాల నుంచి వచ్చినోళ్లం.. నీలాగా అడ్డమైన తొక్కుళ్లు తొక్కుకుంటూ వచ్చినోళ్లం కాదు. ఈయనకు బేసిక్స్ తెలియవు.. బేసిన్స్ తెలియవు అని నేను ఉట్టిగా అనలేదు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందని సామాన్య రైతును అడిగినా, స్కూల్ పిల్లగాడిని అడిగినా.. గోదావరి మీద కట్టిండ్రు అని చెప్తరు. సీఎం రేవంత్‌కు దాని మీద జ్ఞానం లేకపోవడం శోచనీయం. రేవంత్ రెడ్డి తెలుసుకోవాల్సింది ఏందంటే.. బూతులు తెలుసుకున్నంత సులువు కాదు.. బేసిన్ల గురించి తెలుసుకోవడం. బూతులు మాట్లాడినంత సులువు కాదు.. బేసిన్ల గురించి అర్థం చేసుకోవడం రేవంత్ రెడ్డి గారు. నీ చిల్లర రాజకీయాలతో నీ అజ్ఞానాన్ని బయట పెట్టుకుని రాష్ట్రం పరువు తీశావు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

## బనకచర్లపై బిఆర్‌ఎస్ రాజకీయ చిచ్చు !

**ఆకాంక్ష :** బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయ నాయకులు మళ్ళీ వివాదం రేపి పబ్బం గడుపుకునే ప్రయత్నంలో ఉన్నారు. గతంలో ఉమ్మడి ఎపిలో బాబ్లీ గొడవ చేశారు. అది సమిసిపోయింది. తాజాగా బనకచర్ల దొరికింది. ఇప్పుడు దీనిని సాగదీస్తూ, సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసే యత్నాలు మొదలయ్యాయి. రాయల సీమకు నీరందిస్తామని జగన్‌తో లంచ్ మీటింగ్‌లో ప్రకటించిన కెసిఆర్ పార్టీ బిఆర్‌ఎస్ ఇప్పుడు బనకచర్లపై విమర్శలు అందుకుంది. బనకచర్ల అనేది వృధాగా పోతున్న గోదావరి నీళ్లను మాత్రమే నిల్వచేసే ప్రాజెక్ట్. దీని నిర్మాణంతో ఎగువన ఉన్న తెలంగాణలో నీటిని తరలించుకునే అవకాశం లేదు. పైన నీళ్లు లేకుంటే గోదావరి ఎండిపోతుంది. అప్పుడు బనకచర్లకు నీరు వెళ్లడం అసాధ్యం కూడా. మొన్నటి వరకు తెలుగు రాష్ట్రాలు ఒక్కటే. ఉమ్మడి ఎపి అయినా, విడిపోయి రెండు రాష్ట్రాలుగా వేరయినా రైతులు, ప్రజలు ప్రయోజనాలు పొందాల్సిందే. నిజానికి గోదావరిలో ఏటా వందల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయి. ఇలా మనం ఏటా వర్షాకాలంలో వృధాగా పోతున్న నీటిని చూసి చింతిస్తున్నాం తప్ప అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నించడం లేదు. కాళేశ్వరం పేరుతో కట్టిన ఆనకట్ట వృధాగా పోయింది. కేవలం కమీషన్ల కోసం కట్టి ఇంజనీరింగ్ ప్రతిభ అని చెప్పుకున్న కెసిఆర్, ఇప్పుడేమో, దానిపై విచారణ సాగగానే మాటమారుస్తున్నారు. కాళేశ్వరం సరిగా కట్టివుంటే, సరైన ప్రాంతంలో డిజైన్ చేసివుంటే గోదావరి నీళ్లను మనం ఉపయోగించుకునే వీలుండేది. కానీ ఇప్పుడది తెల్ల ఏనుగులా మారింది. రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడానికి ఎలా వ్యవహరిస్తారన్న దానికి కాళేశ్వరం ప్రత్యేక ఉదాహరణ. బిబిసి సహా అనేక చోట్ల దీనిని మానవనిర్మిత అద్భుతంగా ప్రచారం చేసుకున్న కెసిఆర్, ఆయన బృందం ఇప్పుడు కేబినేట్ అనుమతితోనే నిర్మించామని మాటమార్చారు. నిజానికి గోదావరి జలాలను ఎంతగా వినియోగించుకుంటే అంతమంచిది. చుక్కనీరు కూడా సముద్రంలో కలిసి పోకుండా తెలంగాణ, ఎపిలు ఉమ్మడిగా ప్రణాళికలు సిద్దం చేయాలి. అంతేగాని వివాదాలు కాదు. దీనికోసం కేంద్రాన్ని కలవడం, సుప్రీం కోర్టుకు వెళ్లడం సరికాదు. ఈ వ్యవహారంలో చిచ్చురాజేసి చలి కాచుకోవాలన్న బిఆర్‌ఎస్ ప్రయత్నాలు కూడా ఆమోద యోగ్యం కాదు. నిజానికి బనకచర్ల అనుసంధానంపై రగడను బీఆర్‌ఎస్ పార్టీ ప్రముఖంగా లేవదీసింది. ఆ పార్టీ అధికార మీడియాలో ప్రతిరోజూ వరసబెట్టి ఈ అనుసంధానానికి, ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేక కథనాలు వస్తున్నాయి. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ ఉపయోగించుకోగా మిగిలిన నీరే కిందకు పోతుందనే స్పృహ లేకుండా బీఆర్‌ఎస్ తీరు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంభకోణం బీఆర్‌ఎస్ పార్టీ మెడకు చుట్టుకోవడంతో దాన్ని పక్కదారి పట్టించేందుకు బనకచర్ల వ్యవహారాన్ని బిఆర్‌ఎస్ ప్రచారం చేసుకుంటోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు దెబ్బ తిని నీటిని నిల్వ చేయక పోవడానికి, అవినీతిపై కమిషన్ విచారణ చేయడంతో వ్యూహాత్మకంగా బిఆర్‌ఎస్ బరితెగింపు రాజకీయం చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై న్యాయ విచారణ జరుపుతున్న ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరై ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అయితే కాళేశ్వరం ఎపిసోడ్ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీఆర్‌ఎస్ పార్టీ బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై దుమ్మెత్తి పోస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి వాదనలు తీసుకుని వచ్చే వారి రాజకీయ దురుద్దేశ్యాలను ఎండగట్టాల్సిందే. ఈ నీటిని పూర్తిగా ఎలా నిలువరించాలో ఆలోచన చేయాలి. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లు కిందకు వస్తేనే ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకొనే వీలుంటుంది. అప్పుడే బనకచర్లకు నీరు వెళు తుంది. అంతే తప్ప సముద్రంలోకి వెళ్లదు. ఈ ఆలోచన మంచిదే. మహారాష్ట్ర కట్టిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తితేనే శ్రీరామ్‌సాగర్‌కు నీళ్లు వస్తున్నాయి. గోదావరి నదిలో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తన వాటాకు మించి ప్రాజెక్టులు కట్టుకొంటే పై నుంచి అవసరమైన మేరకు నీళ్లు రాకుంటే అవి వృధాగా ఉండాల్సిందే. బనకచర్ల ద్వారా వృధానీటి తరలింపు సఫలమైతే నదుల అనుసంధానానికి అడుగు వేసిన వారం అవుతాం. కేంద్రం కూడా ఇలాంటి సమస్యలపై సత్వరంగా స్పందించి, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చించాలి. అంతేతప్ప తాత్సారం చేయరాదు. చోద్యం చూడరాదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటివాటాల వివాదం అపరిష్కృతంగా ఉంది. కృష్ణా విషయంలో తరచూ కీచులాటలు తప్పడం లేదు. ఒకవేళ బనకచర్ల సాకారం అయితే కృష్ణాపై ఒత్తడి తగ్గుతుంది. గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన 1486.85 టీఎంసీల్లో 957.85 టీఎంసీల నీళ్లు తమవని తెలంగాణ చెబుతున్నది. ఇదే నిజమైతే...ఈ నీటిని నిలవచేయడానికి అవసరమైన ప్రాజెక్టులు నిర్మించాలి. ట్రిబ్యునల్ నియామకమైతే దాని ముందు తన వాటాను గురించి వాదించవచ్చు. ప్రస్తుతం తను చెబుతున్న వాటా మేరకు కొన్ని ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఆమోదం కోసం కృషి చేస్తున్నది. తెలంగాణ కూడా గోదావరి జలాలను ఒడిసిపట్టే ప్రయత్నం చేయడంలో తప్పు లేదు. అయితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా, ఇక్కడి నుంచి నీరు కిందికి పోతేనే వారి ప్రయత్నం ఫలిస్తుంది. ఎగువ రాష్ట్రాలు నిర్మించే ప్రాజెక్టులపై సాధారణంగా దిగువ రాష్ట్రాలు అభ్యంతరాలు చెబుతాయి. ఎందుకంటే దిగువన ఉన్న తమకు నీరు వస్తుందో రాదో అన్న భయం ఉంటుంది. ఆల్మట్టి, నారాయణపూర్ , బాబ్లీ ప్రాజెక్టులు ఇలా కట్టినవే. దీంతో కృష్ణా గోదవరుల్లో సకాలంలో నీరు రావడం లేదు. ఎగువన భారీ వర్షాలు పడి, ప్రాజెక్టుల్లోకి నీరు వస్తేనే కృష్ణమ్మ గలగలలు వినిపిస్తాయి. ఇదే క్రమంలో తెలంగాణ ప్రాజెక్టులు కడితే ఎపికి నష్టం తప్ప, ఎపి ప్రాజెక్టులు కడితే తెలంగాణకు నష్టం ఉండబోదు. పోలవరం వల్ల వరద ముంపు ఉందంటున్న తెలంగాణ నేతలు, దానినీరు మరింతగా రాకుండా కిందకు వెళితే మంచిదే అన్న విషయం ఆలోచించడం లేదు. దిగువన ఉండే ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు కట్టుకొంటే ఎగువన వుండే తెలంగాణకు ఏ విధంగా నష్టం కలుగుతుందో బిఆర్‌ఎస్ నేత హరీష్ రావు చెప్పాలి. రాయలసీమకు నీళ్లు పారిద్దామన్న కెసిఆర్ ఈ పంచాయితీపై ఎందుకు నోరు మెదపడం లేదో చెప్పాలి. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులకు వాడుకోగా ఏటా అపారమైన వరదనీరు వెల్లువెత్తుతుంది. ఈ వరదనీటిని వాడుకొనేందుకే గోదావరిపై బనకచర్ల అనుసంధానం రూపకల్పన చేస్తున్నారు. ఈ వివాదం జటిలం కావడానికి బిఆర్‌ఎస్ కారణం తప్ప మరొకరు కాదు. దీంతో పాటు జగన్మోహన్‌రెడ్డి కూడా బాధ్యులే. 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కృష్ణ జలాలు పంపకానికి తోడు, గోదావరి జలాల వాటాలు తేల్చేందుకు ట్రిబ్యునల్ వేయాలని తీర్మానం చేశారు. అయితే కృష్ణ జలాల ట్రిబ్యునల్ కోసమే కేసీఆర్ పట్టుబట్టారు. దానితో బీజేపీ 2023 ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం కృష్ణా ట్రిబ్యునల్ వేసింది. కానీ గోదావరి ట్రిబ్యునల్ ఇంతవరకు వేయలేదు. కేసీఆర్ లాగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గోదావరి ట్రిబ్యునల్ కోసం కేంద్రం వెంట పడలేదు. సంవత్సరం గడచిపోయినా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా గోదావరి ట్రిబ్యునల్‌పై అంత పట్టుదలగా లేదు. గోదావరి ట్రిబ్యునల్ నియామకమై ఎవరి వాటాలు ఎంతో తేలిపోయి ఉంటే, ఇప్పుడు గోదావరి బనకచర్ల అనుసంధానంపై తెలంగాణ వ్యతిరేకించే అవకాశం ఉండేది కాదు. పైగా ఏ నదీ పరీవాహక ప్రాంతంలోనైనా చిట్టచివరన వుండే రాష్ట్రానికి మిగులుతో పాటు వరద జలాలపై హక్కులు లభిస్తాయి.

# రెండు తలలు, మూడు కళ్లతో అరుదైన దూడకు జన్మనిచ్చిన ఆవు...



**లక్నో(ఆకాంక్ష న్యూస్) :** ఒక ఆవు అరుదైన దూడకు జన్మనిచ్చింది. పుట్టిన దూడకు రెండు తలలు, మూడు కళ్లు ఉన్నాయి. దీంతో దీనిని చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఆ దూడకు కొందరు పూజలు కూడా చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని భాగ్‌పత్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూన్ 18న టిక్రీ గ్రామానికి చెందిన జాహిద్ పెంచుతున్న ఆవు అరుదైన దూడకు జన్మనిచ్చింది. పుట్టిన దూడకు రెండు తలలు, మూడు కళ్లు ఉన్నాయి. ఇది చూసి జాహిద్ ఆశ్చర్యపోయాడు.కాగా, ఈ విషయం తెలిసిన స్థానికులు ఆ ఇంటికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రెండు తలలు, మూడు కళ్లతో పుట్టిన అరుదైన దూడను చూసేందుకు ఎగబడ్డారు. పైకి లేవలేకపోతున్న ఆ దూడకు కొందరు వ్యక్తులు పూజలు చేశారు. మరికొందరు డబ్బులు కూడా ఇచ్చారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.మరోవైపు రెండు తలలున్న ఆవు లేక దూడను పాలీసెఫాలీ అని పిలుస్తారని పశు వైద్యులు తెలిపారు. పిండం అసంపూర్ణంగా విడిపోవడం లేదా రెండు పిండాల కలయిక కారణంగా ఇలా జరుగుతుందని చెప్పారు. చాలా అరుదుగా రెండు తలలతో పుట్టే దూడలు స్వల్ప కాలం మాత్రమే జీవించే అవకాశమున్నదని వెల్లడించారు.

# ప్రసాదరావుకి గట్టుపల్లి స్మారక పురస్కారం ప్రధానం

**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** హైదరాబాద్ కళాభారతిలో జి ఎస్ ఆర్ అండ్ ఫ్రెండ్స్ ఈవెంట్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గట్టుపల్లి చెంచు రామారావు 94వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రముఖ కవి రఘు శ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సభకు కర్ర శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. జిఎస్సార్ రుక్మిణి దంపతులు చెంచు రామారావు చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రకాశం భావించారు .ఈ సందర్భంగా ప్రముఖ రంగ స్థల టీవీ నటులు రచయిత గాయకులు సిహెచ్ ప్రసాద్ రావు కి గట్టుపల్లి చెంచు రామారావు స్మారక పురస్కారాన్ని ప్రధాన చేసి సకల కళానిధి పిరుదును ప్రదాలను చేసి సత్కరించారు. అనంతరం అతిధులు మాట్లాడుతూ ప్రసాద్ రావు గొప్ప నటులే కాకుండా మంచి ఆధ్యాత్మికవేత్త అని సేవా కార్యక్రమాలతో గత 30 సంవత్సరాలుగా కళా రంగంలో రాణిస్తున్నారు. అనంతరం జి ఎస్ ఆర్ శారదమ్మ అరుణ కృష్ణమోహన్లు మాట్లాడుతూ ప్రసాద్ రావుకి గట్టుపల్లి పురస్కార ప్రధానం అవనిత్య భరితంగా ఉందని కొనియాడారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో సరోజ, అనురాధ, గోవింద, లక్ష్మి, పేర్ని అన్నపూర్ణ, మహాలక్ష్మి, రత్నమని, సుమ బిందు, సర్వ శ్రీ విజయ కేసరి కృష్ణమోహన్ శోభన్ బాబు, కర్ర శ్రీనివాస్ తదితరులు గీతలను ఆలపించి నివాళులర్పించారు అనంతరం సిహెచ్ ప్రసాద్ రావు స్పందన ప్రసంగం చేశారు

# గాంధీ భవన్ లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**హైద్రాబాద్(ఆకాంక్ష న్యూస్) :** ఫీషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరిగాయి.. ఈ సందర్బంగా మెట్టు సాయికుమార్ తో పాటు నేతలు రాహుల్ గాంధీ చిత్ర పటానికి పులమాలలువేసి ఘనంగా నివాళు ళ్ అర్పించారు.స్వీట్స్ పంచి పెట్టారు.ఈ సందర్బంగా మెట్టు సాయి కుమార్ ఆద్వర్యం లోస్కూల్ పిల్లకి బుక్స్ తో పాటు పెన్ పెన్సిల్ లు నేతలు పంచి పెట్టారు.ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకుడు వీ హనుమంత రావు వీరితో పట్టు సెలబ్రేషన్స్ లో పాల్గొన్న ఎంఎల్సీ అమీర్ ఆలీఖాన్, కార్పొరేషన్ ఛైర్మెన్ రియాజ్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు

# బేగంపేట్ ఏబీవీపీ నగర అధ్యక్షుడిగా డా. నరేందర్ రెడ్డి



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కూకట్పల్లి విభాగ్ సికింద్రాబాద్ జిల్లా, బేగంపేట్ శాఖ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు జానారెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జానారెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. బేగంపేట్ నగర అధ్యక్షుడిగా డా. నరేందర్ రెడ్డిని , నగర కార్యదర్శిగా కొ్ర.పవన్ చౌహన్ లతో పాటు ఇతర విద్యార్థి పరిషత్ నాయకత్వ బాధ్యతలు మరియు వివిధ ఆయమాలు గతివిధుల బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్బంగా డా:ఎన్.జానారెడ్డి మాట్లాడుతూఏబీవీపీ గురించి ఏబీవీపీ చేసిన కార్యక్రమాల గురించి కొనియాడారు. విద్యార్థి సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపక్షం వలే ఏబీవీపీ నాయకత్వం వహిస్తుంది అని అన్నారు. మరియు మరియు ఇతర విద్యార్థి పరిషత్ నాయకత్వ బాధ్యతలు మరియు వివిధ ఆయమాలు గతివిధుల బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు మరియు రాబోయే రోజుల్లో నగరంలో విద్యార్థి పరిషత్ ను ఎలా ముందుకు నడపాలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసారు.అనంతరం సికింద్రాబాద్ జిల్లా కన్వినర్ బాలకృష్ణ మాట్లాడుతూ బేగంపేట్ టౌన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుండి మొదలుకుంటే ఇప్పటివరకు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం %ూదీవూ% ఎల్లప్పుడూ ముందే ఉంటుందన్నారు.

# పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట తల్లి కొడుకు ఆందోళన

## పురుగుల మందు డబ్బాతో ఆక్రందనలు ■ న్యాయం చేయకపోతే ఆత్మహత్యకే సిద్ధమంటూ హెచ్చరిక...

**ఎద్దపల్లి (ఆకాంక్ష న్యూస్) :** పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట పురుగుల మందు డబ్బాతో తల్లి-కొడుకు కన్నీరుమున్నీరు అయ్యారు. న్యాయం జరిగే వరకు జీవితాన్ని అరగంతో పెట్టి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సబ్బితం గ్రామానికి చెందిన రాజు శంకరయ్య అనే రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై మానసికంగా ప్రభావితమయ్యారని, అప్పటి నుంచి తరచూ ఇంటిని వదిలిపెట్టి తిరుగుతూ ఉంటారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రతి సారి స్థానికుల సాయంతో తిరిగి ఇంటికి తీసుకొచ్చేవారన్నారు. ఇలాంటి పరిస్థిలో తన భర్త పేరున ఉన్న 4 ఎకరాల 28 గుంటల భూమిని రాఘవపూర్ గ్రామానికి



చెందిన మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేష్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని బాధితురాలు ఆరోపించారు. గతంలో కూడా భూమిని ఇతరులకు విక్రయించే ప్రయత్నం జరిగినపుడు కలెక్టరేట్ వద్ద ఫిర్యాదు చేసి భూమిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టించామని చెప్పారు. అయితే తాజాగా ఆడెపు వెంకటేష్ తన రాజకీయ బలాన్ని ఉపయోగించి అధికారుల సహకారంతో భూమి స్థితిని మార్చించి, పట్టా పొందాడని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై కలెక్టర్‌కు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల వైఖరి నిర్లక్ష్యంగా మారిందని వాపోయారు. మాకు న్యాయం జరగకపోతే కలెక్టరేట్ ఆవరణలోనే పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంటాం" అంటూ హెచ్చరించిన తల్లి-కొడుకులు, మాజీ సర్పంచ్ నుంచి తమకు ప్రాణహాని ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు వెంటనే స్పందించి, బాధితుల మొరను పరిశీలించి దర్యాప్తు జరిపించాలని, అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# బాసర క్షేత్రంలో ఉత్తమ దాంపత్య జీవన సాఫల్య పురస్కారములు ప్రదానం



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపములో శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము( కోటి పార్థివలింగ స్థూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము ) మాసో త్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమములు, అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవం గా జరిగినవి. ముందుగా దీపారాధన,కలశస్థాపన, పుణ్యాహవచనము ,లక్ష్మీ గణపతి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య, కోటి పార్థివ లింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకము , కుంకుమార్చన ,గణపతి, నవగ్రహ ,రుద్ర ,సరస్వతి హెూమములు, భూదాన సంకల్ప పూజ, మరియు అన్నదానము ఘనంగా జరిగింది..సాంస్కృతిక కార్యక్రమములో భాగంగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గణించిన న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెని లిమిటెడ్ రిటైర్డ్ బ్రాంచ్ మేనేజర్ సీతంరాజు సూర్య కుమార్ కరుణకు,సంస్కృతాంధ్ర భాషా కోవిదులు, వైదిక కార్యక్రమ నిర్వాహకులు, సుబ్బారావు అనురాధ కు, సందగిరి వీరభద్ర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు, దేవాలయ అభివృద్ధి సమితి సభ్యులు శ్రీనివాస్ శర్మ కళ్యాణికి, నిర్మల్ వాస్తవ్యులు శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి ప్రియ శిష్యులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత, విశ్రాంత అధ్యాపకులు, గాదె ప్రమోద్ సరళలకు నలుగురికి ఉత్తమ దాంపత్య జీవన సాఫల్య పురస్కారములు మరియు వరంగల్ వాస్తవ్యులు శ్రీమయూరి నాట్య కళా క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు నాట్యాచార్యులు కే అరుణ రాజ్ కుమార్ కి ఉత్తమ సాంస్కృ తిక నాట్య సేవా పురస్కారము శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీనిర్మల సంధ్య అంబికానాథ శర్మ దంపతులు అందజేసి సత్కరించారు. నాట్య గురువుల యొక్క శిష్యులు చక్కని నృత్యాభినయంతో కళా ప్రియులను కట్టి పాడేశారు.పదాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ భావాలకు అద్దం పట్టేలా అభినయిస్తూ ప్రదర్శించిన నృత్యాంశములు అందరిని ఆకట్టుకున్నాయి. ఉత్తమ దాంపత్య జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు సభలో మాట్లాడుతూ బాసర సరస్వతి క్షేత్రము లో ఈ పురస్కారం అందుకోవడము ఆనందము గా మరియు గర్వము గా ఉన్నదని మరియు ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము లో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రతి నెల మాసోత్సవము సందర్భముగా ప్రత్యేక పూజ కార్యక్రమములు, సంగీత, సాహిత్య,నృత్య, ధార్మిక , ఆధ్యా త్మిక కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని మరియు దేవాలయ అభివృద్ధికి మేమంతా సహకరిస్తామని అన్నారు. భైంసా వాస్తవ్యులు శ్రీ గుజ్జలవార్ సాయినాథ్ సంధ్య, ముత్యం సాంబశివరాజు సవిత, కొత్త వార్ శ్రీనివాస్ రమాదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్స్..

**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్స్.. వేలాది మందిపై ప్రభావం..! పడీ అవకాశం లేకపోలేదు.ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130 కంపెనీలు కలిసి 61 వేల మంది ఉద్యోగులను తొలగించాయి.ఇక ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. తాజా రౌండ్ సేల్స్ విభాగంలో ఉండనున్నట్లు సంస్థ అధికారులను ఊటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అయితే, ఈ లేఆఫ్స్‌పై మైక్రోసాఫ్ట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు.కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను



క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూన్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

# పార్టీ శ్రేణులను పరామర్శిస్తే తప్పా...?

## వైఎస్ఆర్ సిపి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి...

**అమరావతి(ఆకాంక్ష న్యూస్) :** వైఎస్ఆర్ సిపి పార్టీ శ్రేణులను పరామర్శిస్తే తప్పా?, ఎందుకు ఇన్ని ఆంక్షలు? అని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. మొన్నటి పొదిలి పర్యటనలోనూ తనకు ఇబ్బందులు సృష్టించారని మండిపడ్డారు. గురువారం జగన్ మీడియాతో మాట్లాడారు. 40వేల మందిపై రాళ్లు వేసే ప్రయత్నం చేశారని, రైతులు సంయమనం పాటించారని, అయినా కేసులు పెట్టారని, రైతులను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు.ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే భూస్థాపితం చేస్తారా? టాపిక్ డైవర్ట్ చేయడానికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేశారని చురకలంటించారు. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వనని అన్నందుకు చెవిరెడ్డి గన్‌మెన్‌ను హింసించారని, ఆ గన్‌మెన్ స్వయంగా డిజిపి, రాష్ట్రపతికి లేఖలు రాయాల్సి వచ్చిందన్నారు. చెవిరెడ్డి కుమారుడిని కూడా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, లిక్కర్ కేసులో సంవత్సరం నుంచి చెవిరెడ్డి భాస్కర్ పేరే లేదన్నారు. చంద్రగిరిలో ఎదురు ఉండకూడదనే చెవిరెడ్డిపై కేసులు పెట్టారని జగన్ ఆరోపణలు చేశారు. సడెన్‌గా గిరి అనే కానిస్టేబుల్‌ను తెరపైకి తీసుకొచ్చారని, ఇరికించాలనుకుంటే ఎవరినైనా ఇరికించొచ్చన్నారు. లిక్కర్ కేసులో లేని ఆధారాలను తయారు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిన్నెల్లిపైనా తప్పుడు కేసులు పెట్టారని, నందిగం సురేష్‌పైనా కేసుల మీద కేసులు పెడుతున్నారని, వల్లభనేని వంశీని 60రోజులుగా జైలులో పెట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బీహార్‌ను చేయడంలో చంద్రబాబుకు మించిన గొప్ప నాయకుడు ఎవరూ లేరని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ఫ్యూలాంటి పరిస్థితుల మధ్య తన పర్యటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.



# తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెతుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**సీఎం రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం ■ ముఖ్యమంత్రి హోదాకు అది తగదు..**

- కేసీఆర్ లేకుంటే, తెలంగాణ తేకుంటే రేవంత్ రెడ్డి ఎక్కడ..?
- రేవంత్ రెడ్డికి సాగునీటి అవసరాల గురించి ఏ మాత్రం అవగాహన లేదు..
- చంద్రబాబుకు ఎందుకు లేఖ రాయడం లేదు?
- మండిపడ్డ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టేందుకే ఎక్కువ ప్రయత్నం చేస్తున్నది అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. బనకచెర్ల ద్వారా ఆంధ్రాకు సాగునీటిని తరలించుకు పోయే ప్రయత్నాలకు ఈ ప్రభుత్వం సహకరిస్తుంది అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించిన తర్వాతనే ఈ ప్రభుత్వం బనకచెర్ల విషయంలో స్పందించింది. అఖిలపక్ష సమావేశంలో రాజకీయాలు మాట్లాడడంతో పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆయన సమావేశం నుండి బయటకు వచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అయిన వద్దిరాజును కించపరిచినట్లు రేవంత్ రెడ్డి మాట్లాడారు. సీఎంకు ఈ విషయంలో ఏదో పాండిత్యం ఉన్నట్లు మాట్లాడారు. బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఏదో సాధించినట్లు వారిని పొగిడారు అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు.

### సీఎం రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం..

కేంద్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఒప్పందంగా చిత్రీకరించడం సీఎం రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం.. సమావేశంలో ఎవరు ఏం మాట్లాడినా రికార్డ్ చేస్తారన్న విషయం తెలియకపోవడం విడ్డూరం. మొత్తం సమావేశంలో బనకచర్లను ఖచ్చితంగా అడ్డుకుని తీరతాం అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి ఎందుకు చెప్పడం లేదు..? పాలమూరు %-% రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.32,500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఖర్చు చేసింది.. ఇక్కడ కేవలం 172 ఎకరాలు మాత్రమే సేకరించాల్సి ఉంది.. ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తయ్యాయి. పాలమూరు కరువును శాశ్వతంగా రూపుమాపే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. మిగిలిన పనులు పూర్తి చేసి వెంటనే నీటి కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పట్టించుకోవడం లేదు అని నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

### ముఖ్యమంత్రి హోదాకు అది తగదు..

రేవంత్ మాట్లాడే భాష ఆయనకు అందంగా అనిపించవచ్చు.. కానీ ముఖ్యమంత్రి హోదాకు అది తగదు.. మీరు మాట్లాడే భాష మీ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. కృష్ణా నీళ్ల విషయంలో తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది.. తెలంగాణ పోరాటమే నీళ్ల కోసం జరిగింది.. ఏపీలో కేవలం తెలుగుగంగకు మాత్రమే నీటి కేటాయింపు ఉంది.. కానీ ఆంధ్రాలో 300 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మించుకున్నారు.. ప్రస్తుతం కృష్ణా నదిలో తగినంత నీరు అందుబాటులో లేదు. కృష్ణా బేసిన్‌కు కాళేశ్వరం ద్వారా సాగునీటిని తరలించాలన్న ఆలోచన కేసీఆర్‌కు ఉన్నది. తెలంగాణ ప్రయోజనాలు, ఇక్కడి అవసరాలు తీరిన తర్వాత మిగిలిన ప్రాంతాలకు సాగునీరు ఇస్తామని కేసీఆర్ అన్నారు.. దీనికి నిన్న, నేడు, రేపు ఎప్పటికి కట్టుబడి ఉంటాం అని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

### కేసీఆర్ లేకుంటే, తెలంగాణ తేకుంటే రేవంత్ రెడ్డి ఎక్కడ..?

కేసీఆర్ లేకుంటే, తెలంగాణ తేకుంటే రేవంత్ రెడ్డి ఎక్కడ ఉండేవాడు.. ప్రతి అంశంలో తెలంగాణను కించపరిచి, తెలంగాణను అవహేళన చేసి మాట్లాడడం తగదు.. ఇదొక మానసిక రుగ్మత అనిపిస్తుంది. అఖిలపక్షంలో ప్రతిపక్ష పార్టీలను ఎందుకు పిలుస్తారు? ప్రభుత్వ ఉద్దేశం ఏంటో చెప్పాలి.. కానీ అధికారుల ముందు రాజకీయాలు ఎలా మ్లాట్లాడతారు? బనకచెర్ల ప్రాజెక్టు నేపథ్యంలో నాగార్జున సాగర్ కాలువలను వెడల్పు చేస్తున్నది.. ఇది రాష్ట్ర విభజన చట్టానికి వ్యతిరేకం.. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా నిలదీయడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా సాగునీటి పంపకాలు, ప్రాజెక్టుల గురించి అపెక్స్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కోరడం లేదు? అపెక్స్ సమావేశం ఏర్పాటు చేయకుంటే ప్రాజెక్టులకు అనుమతులు ఎలా వస్తాయి? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.

### రేవంత్ రెడ్డికి సాగునీటి అవసరాల గురించి ఏ మాత్రం అవగాహన లేదు..

బనకచర్ల ప్రాజెక్టుకు ఎలాంటి ఫీజిబులిటీ లేకున్నా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించగానే రూ.82 వేల కోట్లు ఖర్చయ్యే పథకానికి ఏకంగా 50 శాతం భరిస్తామని హామీ ఇవ్వడం దేనికి నిదర్శనం.. తెలంగాణ మీద బీజేపీకి ఉన్న కక్షకు ఇది నిదర్శనం.. ఇది తెలంగాణకు గొడ్డలిపెట్టు. కనీసం తెలంగాణను సంప్రదించాలన్న ఉద్దేశం కూడా కేంద్రానికి లేదు. నదుల అనుసంధానం కింద ఇది ఇంటిగ్రేట్ అవుతుందని ఏపీ కేంద్రాన్ని ఒప్పించుకుంది. తెలంగాణ ప్రభుత్వానికి అధికారం మీద తప్ప ప్రజాప్రయోజనాలు, ప్రాంత ప్రయోజనాల మీద ముందు చూపు లేదు. ఏ ప్రాజెక్టు, ఏ నది నుండి ఎంత నీళ్లు వస్తాయి అని పూర్తి అవగాహన ఉన్న కేసీఆర్‌ను వదులుకున్నామని తెలంగాణ రైతాంగం భావిస్తున్నది. కానీ రేవంత్ రెడ్డికి ఈ రాష్ట్ర ఈ సాగునీటి అవసరాల గురించి ఏ మాత్రం అవగాహన లేదు.. మీడియా సమావేశంలో రేవంత్ అడ్డగోలుగా మాట్లాడుతుంటే మంత్రులు వారించరా? అని మాజీ మంత్రి ప్రశ్నించారు.

### చంద్రబాబుకు ఎందుకు లేఖ రాయడం లేదు?

నిజంగా రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డ అయితే ఇన్నేళ్లు మేము సాగునీళ్లు కోల్పోయినం అని అధికారంలోకి వచ్చిన మొదటిరోజే కేంద్రానికి నీళ్లను కేటాయించాలని లేఖ రాయాల్సింది. గోదావరి నుండి బనకచర్లకు నీళ్లను తీసుకపోతున్న నేపథ్యంలో మరి ఇప్పటికే కృష్ణా నది నుండి నీళ్లు తీసుకుపోతున్నందున ఇక మీదట కృష్ణా నది నుండి నీళ్లు తీసుకుపోవద్దని రేవంత్ రెడ్డి చంద్రబాబుకు ఎందుకు లేఖ రాయడం లేదు? ప్రభుత్వానికి ఒక విధానం లేదా? ఇప్పటి వరకు తీసుకువెళ్తున్న నీళ్లను బంద్ పెట్టాలని ఎందుకు అడగడం లేదు? అని నిరంజన్ రెడ్డి నిలదీశారు.ఖ

# అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా ప్రమాదంలో దెబ్బతిన్న బ్లాక్‌బాక్స్

**డేటాను విశ్లేషించేందుకు బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నట్లు సంబంధిత అధికారులు....**




**న్యూఢిల్లీ (ఆకాంక్ష న్యూస్) :** గతవారం అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో దాదాపు 270 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ఇక ఈ ఘటనపై అధికారులు విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే, దర్యాప్తులో కీలకమైన బ్లాక్‌బాక్స్ ప్రమాదంలో దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో అందులోని డేటాను విశ్లేషించేందుకు బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ ఏ-171 విమానం గత గురువారం కూలిపోయిన విషయం తెలిసిందే. టేకాఫ్ అయిన నిమిషాల్లోనే రెసిడెంట్ డాక్టర్స్ హాస్టల్ భవనంపై కూలిపోయింది. ఇక ఈ ప్రమాదం జరిగిన దాదాపు 27 గంటల తర్వాత ఈ బ్లాక్‌బాక్సును విమానం కూలిన బిల్డింగ్‌పై గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు ఈ బ్లాక్ బాక్స్ చాలా కీలకం. అయితే, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో అందులోని డేటాను విశ్లేషించేందుకు దెబ్బతిన్న బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. వాషింగ్టన్ డీసీలోని జాతీయ రవాణా భద్రతా బోర్డుకు పంపే అవకాశం ఉందని సదరు కథనాలు వెల్లడించాయి. సాధారణంగా విమానం తోక భాగంలో బ్లాక్‌బాక్స్‌ను అమర్చుతారు. ప్రమాదాల్లో పేలుడు ద్వారా ఉత్పన్నమయ్యే మంటల తట్టుకునేలా, 1100 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద గంటపాటు ఉన్నా ధ్వంసం కాకుండా వీటిని రూపొందిస్తారు. ప్రమాదానికి గల కారణం, ప్రమాదానికి ముందు ఏం జరిగింది.. తదితర సమాచారం అంతా ఈ బ్లాక్ బాక్సులో నిక్షిప్తమై ఉంటుంది. ఈ సమాచారం ద్వారా ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తారు. భవిష్యత్తు ప్రమాదాలను నిరోధించడానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగ పడుతుంది. అయితే, ఎయిర్ ఇండియా విమానం కూలని అనంతరం 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం ధాటికి బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

# జగన్ శవరాజకీయాలు చేస్తున్నారు:మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

**అమరావతి(ఆకాంక్ష న్యూస్) :**ద ప్రతిపక్షంలోనూ ఎపి వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి అరాచక వైఖరి మారలేదని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. జగన్ శవరాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..వైసిపి హయాంలోనే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నారని, నాగమల్లేశ్వర రావు చనిపోయింది గతేడాది జూన్ 9న అని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చింది గతేడాది జూన్ 12 తేదీన అని చెప్పారు. పోలీసుల వేధింపుల వల్లే ఆత్మహత్య అంటూ వైసిపి దుష్ప్రచారం చేస్తుందని కన్నా లక్ష్మీనారాయణ దుయ్యబట్టారు.



# ప్రపంచస్థాయి శిక్షణ, సౌకర్యాల కల్పన స్పోర్ట్స్ సిటీ ప్రధాన లక్ష్యం....



**అమరావతి(ఆకాంక్ష న్యూస్) :** ప్రపంచస్థాయి శిక్షణ, సౌకర్యాల కల్పన స్పోర్ట్స్ సిటీ ప్రధాన లక్ష్యమని ఎపి మంత్రి నారా లోకేష్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వివిధ కీడల్లో అథ్లెట్లకు మద్దతు లక్ష్యమని అన్నారు. రెండో రోజు డిల్లీలో లోకేశ్ పర్యటించారు. టోనీ బ్లేయర్ తో ముందు కేంద్ర కార్మికశాఖ మంత్రి మాండవీయతో సమావేశమయ్యారు. విద్యారంగంలో అభివృద్ధి కోసం 'టోనీ బ్లేయర్ ఇన్ స్టిట్యూట్ సహకారం కోరారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి సహకారం అందించాలని, ఎపిని స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు చేయూత ఇవ్వాలని అన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని లోకేష్ తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ హబ్ గా మార్చడానికి, రాష్ట్రంలోని పాఠశాలలు, క్రీడల అభివృద్ధికి చేయూత అందించాలని, 39 ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు. క్రీడా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 39 ప్రాజెక్టులకు ప్రతిపాదనలు జరగుతున్నాయని, రూ. 341.57 కోట్లతో ఎపి ప్రభుత్వ ప్రతిపాదనలు ఆమోదించాలని సూచించారు. తిరుపతిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రీజినల్ సెంటర్ ఏర్పాటుకు వినతి చేశారు. అథ్లెటిక్స్, రెజ్లింగ్ స్టేట్ లెవల్ సెంటర్ ను తిరుపతిలో నెలకొల్పాలని నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# బనకచర్ల చట్ట వ్యతిరేకమైన ప్రాజెక్టు



**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** ఽంద్ర మంత్రికి బనకచర్ల చట్ట వ్యతిరేకమైన ప్రాజెక్టు అని వివరించామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్లపై ఆందోళనలను కేంద్ర మంత్రికి చెప్పామని అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బనకచర్లపై రాష్ట్ర ప్రజల్లో, రైతుల్లో ఆందోళనలు ఉన్నాయని, తమ ఆందోళనను పరిగణలోకి తీసుకుంటామని కేంద్రమంత్రి చెప్పారని ఉత్తమ్ కుమార్ అన్నారు. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా చూడమని కోరామని చెప్పారు. ఇచ్చంపల్లి నాగార్జునసాగర్ లింకుతో పెన్నా బేసిన్ కు నీరు తీసుకెళ్ళొచ్చునని, ఇచ్చంపల్లి సాగర్ లింకు అంశంపై చర్చకు సిద్ధమని చెప్పామని తెలియజేశారు. అతిత్వరలో ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంల భేటీ ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి పాటిల్ చెప్పారని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# మరోసారి పేలిన స్పేస్ఎక్స్ స్టార్‌షిప్



**న్యూడిల్లీ(ఆకాంక్ష న్యూస్) :** ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అంతరిక్ష రంగంలో క్రమంగా పురోగతి సాధిస్తున్న ఆయనకు చెందిన స్పేస్ఎక్స్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రయోగాలు వరుసగా విఫలమవుతున్నాయి. తాజాగా స్పేస్ఎక్స్ స్టార్‌షిప్ మరోసారి పేలింది.టెక్సాస్‌లోని ఎలాన్ మస్క్‌కు చెందిన పరీక్ష కేంద్రం వద్ద బుధవారం రొటీన్ స్టాటిక్ ఫైర్ టెస్ట్ నిర్వహించారు. ఈ క్రమంలో అది ఉన్నట్టుండి పేలిపోయింది. ఈ విషయాన్ని స్పేస్ఎక్స్ ఎక్స్ వేదికగా ధ్రువీకరించింది. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇది జరిగిందని పేర్కొంది. స్టార్‌షిప్ 10వ విమాన పరీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని, అధికారులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై విషాదం....




**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** హైదరాబాద్ నగరంలోని దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై బుధవారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. సుష్మ (27) అనే యువతి బ్రిడ్జి మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే... నగరానికి చెందిన సుష్మ, ఎప్పటిలాగే బుధవారం ఉదయం ఆఫీసుకు వెళ్లింది. అయితే రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి అంజయ్య, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. విచారణలో భాగంగా కేబుల్ బ్రిడ్జి వద్ద పరిశీలించిన పోలీసులు అక్కడ ఆమె మృతదేహాన్ని గుర్తించారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు.సుష్మ ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. ఈ విషయంలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతురాలి సెల్‌ఫోన్, వ్యక్తిగత వివరాలు ఆధారంగా మరింత సమాచారం వెలికితీసే పనిలో ఉన్నారు.ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. నిత్యం రద్దీగా ఉండే కేబుల్ బ్రిడ్జిపై చోటుచేసుకున్న ఈ ఘటన పలువురిని కలచివేసింది.

## ఏ.పై.ఎస్.ఎస్.డి.సి మ్యాట్రిక్స్ ఓవర్సీస్ భాగస్వామ్యంతో దోహా - ఖతార్‌లో వెల్డర్లకు విదేశీ ఉద్యోగ అవకాశాలు

**తాడేపల్లి, ఆకాంక్ష :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (APSSDC) మరియు మ్యాట్రిక్స్ ఓవర్సీస్ సంయుక్తంగా దోహా - ఖతార్‌లో నైపుణ్యం గల వెల్డింగ్ ఉద్యోగులకు ప్రత్యేకంగా విదేశీ ఉద్యోగ అవకాశాలను కల్పించే కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ అవకాశాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనుభవం ఉన్న నిపుణుల కోసం అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ మాట్లాడుతూ ఖతార్‌లోని దోహా నగరంలో వెల్డర్ ఉద్యోగాల కోసం 24 నుండి 45 సంవత్సరాల మధ్య వయసు గల పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అలాగే అభ్యర్థులు ITI/IT జలో వెల్డింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి మరియు కనీసం 4 సంవత్సరాల సంబంధిత అనుభవం ఉండాలి అని తెలియజేసారు. అలాగే నెలజీతం ాు= 2,200 నుండి ాు= 2,600 వరకు ఉంటుంది (సుమారు ?51,939 నుండి ?61,365 వరకు), ఉద్యోగం 2 సంవత్సరాల కాంట్రాక్ట్ ఆధారంగా ఉంటుంది. వీసా, విమాన టికెట్లు, వైద్య సౌకర్యాలను సంస్థ భరిస్తుంది. ట్రావెల్, వీసా మొదలైన ప్రక్రియల కోసం ?35,000 రిక్రూట్‌మెంట్ ఫీజుగా వసూలు చేస్తారు, ఇది ముందుగానే చెల్లించవచ్చు లేదా జీతం నుండి తీయబడవచ్చు. అభ్యర్థులు తమ పాస్‌పోర్ట్, ITI/ITC సర్టిఫికెట్, మరియు అనుభవ సర్టిఫికెట్ సమర్పించాలి. దరఖాస్తు చేయడానికి చివరి తేదీ 29 జూన్ 2025. అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు, లేదా skillinternational@apssdc.ఱఅ కు మెయిల్ చేయవచ్చు, లేదా హెల్ప్‌లైన్ నంబర్ ం91-9988853335 కి సంప్రదించవచ్చు.

# ఆర్.ఓ.బి అనుబంధ రహదారుల పనులు ప్రారంభం:ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### సమస్యల పరిష్కారానికి నా సంపూర్ణ సహకారం అందిస్తా:ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- ఎన్.హెచ్ అధికారులతో ఎమ్మెల్యే రాము రివ్యూ సమావేశం...
- సాంకేతిక కారణాలతోనే రోడ్ల పనులు ఆలస్యం...
- అధికారులు చొరవ తీసుకొని ముందుకు సాగాలి...



**గుడివాడ, ఆకాంక్ష :** గుడివాడ పట్టణ పరిధిలోని ఎన్.హెచ్ రహదారుల అభివృద్ధి పనులు అతి త్వరలో ప్రారంభం కానున్నాయని.... ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆర్.ఓ.బి అనుబంధ రహదారుల పనుల ప్రారంభంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులతో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే రాము రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆర్.ఓ.బి. అనుబంధ రహదారుల నిర్మాణ పనుల పురోగతిపై ఎమ్మెల్యే రాము అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గుడివాడ పట్టణంలోని రహదారుల అభివృద్ధి పనుల ఆలస్యంపై అధికారులను ఎమ్మెల్యే రాము ప్రశ్నించారు. రోడ్ల నిర్మాణ పనులకు సాంకేతిక సమస్యలు ఉన్నాయని తెలపడంతో జాతీయ రహదారుల రీజినల్ ఆర్వో మోర్తు ఆర్వో రాకేష్ కుమార్, ఎంపీ వల్లభనేని బాలసౌరీలతో ఎమ్మెల్యే రాము ఫోన్లో మాట్లాడారు. అధికారులు చొరవ తీసుకొని రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని. సమస్యల పరిష్కారానికి నా సంపూర్ణ సహకారం అందిస్తానని ఈ సందర్భంగా అధికారులతో ఎమ్మెల్యే రాము అన్నారు. బస్టాండ్ వద్దనుండి ఆర్ఓబి ప్రణులు ప్రారంభం కావడానికి ముందే. వాటర్ పైప్ లైన్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ దుమ్ములేని రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానన్నారు. ఆర్ఓబి అనుబంధ రహదారుల నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయని, రహదారుల అభివృద్ధికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఆర్ఓబి నుండి బస్టాండ్, ఓల్డ్ బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అనుబంధ రహదారుల అభివృద్ధికి కాంట్రాక్ట్ సంస్థలు పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు. పట్టణంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి ఫైనాన్షియల్ అప్రూవల్స్ కూడా వచ్చాయని ఇతర ప్రాజెక్టులతో ముడిపడి ఉండడంతో ఆలస్యం అవుతుందన్నారు. ఎంపీ బాలశౌరి సహకారంతో ఉన్నతాధికారులతో మాట్లాడి సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. పట్టణంలోని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా రోడ్ల అభివృద్ధి పనులు పట్టా లెక్కించేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని, రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమైన తర్వాత ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ఈ రివ్యూ సమావేశంలో ఎన్.హెచ్ %ఙ.జు% సత్యనారాయణ, %ూ.జు%. శరత్, మున్సిపల్ ఎఎస్ఎన్ ప్రసాద్, సీనియర్ టిడిపి నాయకులు లింగం ప్రసాద్, పంద్రాజు సాంబయ్య,మున్సిపల్ %ూ.జు%లు శ్రావణ్ కుమార్, రాజేష్ ,కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధులు దివాకర్, నిరంజన్, వల్లభనేని కన్స్ట్రక్షన్స్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## యోగ సభ ఆధ్వర్యంలో యోగ ర్యాలీ అవగాహన సదస్సు




**మచిలీపట్నం, ఆకాంక్ష :** ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని యోగా గురువులు ఘంటసాల గుర్నాథ్ బాబు పేర్కొన్నారు. యోగాంధ్ర లో బాగంగా గురువారం ఉదయం నగరంలోని కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో యోగ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎపి యోగ సభ, మచిలీపట్నం యోగా గురువులు గురునాధబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాస్మోపాలిటన్ క్లబ్ సెక్రటరీ వాలిశెట్టి రవి, సభ్యులు స్థానిక నాయకులు మాదివాడ రాము నగర ప్రజలు యోగాసనాలు వేశారు. అనంతరం జరిగిన యోగా అవగాహన సదస్సు లో యోగా ప్రాముఖ్యత గురించి గురునాధబాబు, మాదివాడ రాము వివరించారు. నిత్యం యోగా ఆచరించి ప్రతి ఒక్కరు ఆరోగ్య ప్రయోజనాలు పొందాలన్నారు. అనంతరం కాస్మోపాలిటన్ క్లబ్ నుండి బయలుదేరి యోగ చేద్దాం ఆరోగ్యంగా ఉందాం, మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంచుకుందాం, ప్రాణం ఉన్నంతవరకు ప్రాణాయామాలు చేద్దాం ు ఆయుష్షు ఉన్నంతవరకు ఆసనాలు వేద్దాం అనే నినాదాలతో నగర వీధుల్లో యోగా ర్యాలీ నిర్వహించారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**మచిలీపట్నం, ఆకాంక్ష :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వైద్యులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ మండల కేంద్రమైన మోపిదేవి లో రావివారి పాలెం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలోని మందుల విభాగాన్ని, ప్రయోగశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఏ మందులు అందుబాటులో ఉన్నాయి ముఖ్యంగా పాముకాటు విరుగుడు మందు, రాబీస్ వ్యాధి మందులు ఉన్నాయా లేదా విచారించారు. ఏ ఏ రకాల పరీక్షలు చేస్తున్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడి రోగులను నాగినేని రామారావు, లక్ష్మీ సులోచన, తుమ్మల శంకర్రావు తదితరులను వైద్యం ఎలాగుంటుందని, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు మంచిగా వైద్యం అందిస్తున్నారని వారు సమాధానం చెప్పగా జిల్లా కలెక్టరు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ రావి దుర్గావాణి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింది భవనంలో గదులు సరిపోక వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని పై భవనం సరిగా పూర్తికాక ఇంకా అప్పగించలేదని దాన్ని అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సంబంధిత రహదారులు భవనాల ఇంజనీర్లకు ఫోన్ చేసి పై అంతస్తు భవనాలను త్వరగా పూర్తి చేసి అప్పగించాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అదనపు డి ఎం హెచ్ ఓ వెంకటరావు, తహసీల్దారు శ్రీవిద్య, ఎంపీడీవో స్వర్ణ భారతి, పిహెచ్ సి డాక్టర్లు అనిల్ కుమార్, లక్ష్మీనాథ్ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గంటల వ్యవధిలో ఫోన్ రికవరీ చేసిన పోలీసులు.




**మచిలీపట్నం, ఆకాంక్ష :** గురువారం మచిలీపట్నం జిల్లా వ్యవసాయ శాఖలో ఉద్యోగం చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి ఉదయం ఆటోలో కలెక్టర్ కార్యాలయానికి వచ్చి తన ఫోనును మర్చిపోయారు. ఫోన్ ఆటోలో మర్చిపోయిన విషయాన్ని గ్రహించి మహిళ చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ నబి టెక్నాలజీని ఉపయోగించి గంటల వ్యవధిలో రికవరీ చేసి బాధితురాలు అందించారు.

# సంపూర్ణ అవగాహనతోనే సికిల్ సెల్ నిర్మూలన:జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

### వ్యాధికి అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు ■ గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టితో కార్యక్రమాలు




**మైలవరం, ఆకాంక్ష :** సంపూర్ణ అవగాహనతోనే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించవచ్చని.. జూన్ 19 నుంచి పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండపల్లి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్-వ్యాధి సమగ్ర సమాచారానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, మ్యాన్యువల్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047కు ముందే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వ్యాధికి సంబంధించి వివిధ వర్గాల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. సాధారణంగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటే సికిల్ సెల్ వ్యాధిలో ఈ కణాలు కొడవలి ఆకారంలో ఉంటాయని వివరించారు. ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందని.. ఇది అంటు వ్యాధి కాదని వివరించారు. రక్త పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చున్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఉన్న వ్యక్తి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. సకాలంలో గుర్తించి సరైన వైద్య సదుపాయాలు అందించడం ద్వారా రోగి జీవన నాణ్యతను పెంచొచ్చని పేర్కొన్నారు. రాబోవు తరాలకు వ్యాధి వ్యాపించకుండా నిరోధించాలంటే సరైన అవగాహన ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్‌పర్సన్ సీహెచ్ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డీటీడబ్ల్యూవో విజయశాంతి, ప్రోగ్రాం అధికారి డా. మాధవి, వైద్యాధికారులు డా. పద్మావతి, డా. విజయకుమార్, నోడల్ అధికారి డా. నవీనా, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలి:జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, ఆకాంక్ష :** జిల్లాలోని 4,470 ప్రదేశాలలో ఈనెల 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని తన చాంబర్ నుండి సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి యోగాంధ్ర, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, తల్లికి వందనం కార్యక్రమాలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు చేసుకునే విధంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లందరికీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారన్నారు. ఆ ప్రకారం జిల్లాలోని 4,470 ప్రదేశాలలో ఈనెల 21వ తేదీన ప్రభుత్వం నిర్దేశించిన యోగా ప్రోటోకాల్ ను నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో యోగా కార్యక్రమం తప్పనిసరిగా జరగాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న పౌరులందరూ పాల్గొనేలా చొరవ చూపాలన్నారు. తాడిగడప, ఉయ్యూరు మున్సిపాలిటీలలో, బంటుమిల్లి, మొవ్వ, నాగాయలంక మండలాల్లో శిక్షణా తరగతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. బంటుమిల్లి, నాగాయలంక, నందివాడ, తోట్లవల్లేరు పమిడిముక్కల మండలాల్లో వేదిక నమోదు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాస్థాయి యోగా కార్యక్రమాన్ని ఉయ్యూరులోని విశ్వశాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని అక్కడ అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కూడా అదే రోజు నిర్వహించాల్సి ఉన్నందున యోగా కార్యక్రమం పూర్తయ్యాక వేదిక పరిసరాలు అంతా కూడా పరిశుభ్రం చేయాలని, మొక్కలను నాటాలని, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించాలని, స్వచ్ఛ ఆంధ్ర ుఆరోగ్య అంశాలపై సందేశాలు ఇవ్వాలని సూచించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి జిల్లాలో ఇంకనూ తల్లులు చనిపోయిన కేసులు 409 పెండింగ్లో ఉన్నాయన్నారు. ముఖ్యంగా తాడిగడప, పెడన మున్సిపాలిటీలలో కృత్తివెన్ను మండలంలో ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్రపై ముఖ్యంగా యోగ చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని, ప్లాస్టిక్ రహిత వస్తువులను వాడాలన్నారు. జిల్లాలో స్వర్ణాంధ్ర ుస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ కొందరు అధికారులు సరిగా ఫోటోలు అప్లోడ్ చేయడం లేదన్నారు. ఈసారి అలా జరగకుండా జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. గుర్తించిన యోగ నిర్వహణ ప్రదేశాల వద్ద వేదిక, కార్పెట్, పి ఏ సిస్టం, బ్యానర్లు సిద్ధం చేసుకోవాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రథమ చికిత్స కోసం వైద్య శిబిరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. యోగా కార్యక్రమం నిర్వహించిన తర్వాత అందుకు సంబంధించిన ఫోటోలను అప్లోడ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా చాలామంది ఒకరు ఇద్దరు యోగ చేస్తున్న ఫోటోలను అప్లోడ్ చేస్తున్నారని అలా కాకుండా యోగాలో పాల్గొన్న వారందరి ఫోటో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ జూమ్ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, డీఈవో పివిజే రామారావు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త రవికాంత్ తదితర జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డి ఎల్ డి వో లు, మండల ప్రత్యేక అధికారులు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబం దోపిడీపై ఈడి, సిబిఐ విచారణ జరపాల్సిందే




హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : కేసీఆర్ కుటుంబం దోపిడీపై ఈడి, సిబిఐ విచారణ జరపాల్సిందేనని టీపిసిసి కార్యదర్శి గజ్జెల కాంతం స్పష్టం చేశారు. గురువారం గాంధీ భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.కానీ కేటీఆర్ లుచ్చా నా కొడకా జాగ్రత్త నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు మతి స్థిమితం కోల్పోయి రేవంత్ రెడ్డి పై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారు కేటీఆర్ అని ఎర్రగడ్డ ఆసుపత్రికి పంపించాల్సి వస్తుందని హెచ్చరించారు. కేటీఆర్ మూర?త్వంతో వ్యవహరిస్తున్నారు.తెలంగాణ ఉద్యమ ద్రోహులను పక్కన పెట్టుకొని నోటికొచ్చింది మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు.సంస్కారం మరిచి కేటీఆర్ బూతులు మాట్లాడుతున్నారు. కేటీఆర్ మిమ్మల్ని తీహార్ జైలుకు కాదు..రాష్ట్ర నడిబొడ్డున ఉరితీయాలన్నారు.రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు తీసుకోవాలనుకుంటే అధికారంలోకి రాగానే కెసిఆర్, కేటీఆర్ ,హరీష్ ని జైలుకు పంపేవారు. ప్రధాని నుంచి సామాన్యుడి వరకు ...ఎవరు తప్పు చేసిన చట్ట ప్రకారం చర్యలు ఉంటాయిదోపిడీకి పాల్పడిన వారి లక్ష్యంగానే తెలంగాణ ప్రజలు ఓటుతో సరైన రీతిలో తీర్పు ఇచ్చారు. ఈ కార్ రేసింగ్ లో 650 కోట్లు లెక్క లేకుండా సదరు కంపెనీ తో ఒప్పందం, ఎన్నికల కోడ్ ఉల్లంఘించి కార్ రేసింగ్ లావా దేవీలు జరిపారన్నారు.కేబినెట్ ఆమోదం.. ఆర్బిఐ అనుమతి పొందాకే డబ్బులు ట్రాన్స్ఫర్ చేసే వీలు ఉంటుందన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి లండన్ కి 50 కోట్లు ట్రాన్స్ఫర్ చేశారు. కార్ రేసింగ్ లో లావాదేవీ లతో బిఆర్ఎస్ 40 కోట్ల ఫండింగ్ ,%+ష్ర్తఎఎ% చుట్టూ పక్కల ఉన్నటువంటి భూములను ఇష్టానుసారం దోచుకున్నారు. పదేళ్లు కెసిఆర్ కుటుంబం యదేచ్ఛగా రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. తెలంగాణలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతోంది. కేటీఆర్ కి కోర్టులు, చట్టాలు అంటే గౌరవం లేదు,రామోజీ రావు బెదిరించి ప్రతి ఏడాది 50 కోట్లు తీసుకున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు .మంత్రి హోదాలో పార్క్ హయత్ లో సినిమా ఇండస్ట్రీ వాళ్ళతో ఇల్లీగల్ పనులు నిజం కాదా?సినిమా హిరోయిన్ ను బెదిరించి పార్క్ హయత్ 820 రూమ్ కి తీసుకొచ్చింది వాస్తవం కాదా? పార్కు హయత్ హోటల్ కి ఆర్మూర్ ఎమ్మెల్యే హిరోయిన్ ను కారులో తీస్కొని వచ్చింది వాస్తవం కదా?అని ప్రశ్నించారు. ప్రభాకర్ రావు అండ్ కోని అడ్డం పెట్టుకొని 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్ ట్యాపింగ్ చేశారు. ఇండస్ట్రీలోని ప్రతి హిరోయిన్ ఫోన్ ట్యాపింగ్ చేశారు. జ్యువెలరీ షాపులను బెదిరించి కోట్లకు కోట్లు దండుకున్నారు. డీజీపీ,ప్రభాకర్ రావు కలిసి మావోయిస్టుల పేరుతో ఫోన్ ట్యాపింగ్ కి పాల్పడ్డారు. దేశానికి,రాష్ట్రానికి ప్రమాదం అని తెలిస్తేనే ఫోన్ ట్యాపింగ్ వంటి చర్యలకు పూనుకుంటారన్నారు. కేసీఆర్ కుటుంబ దోపిడీని సినిమా సీరియల్ ఎపిసోడ్ రూపంలో బయట పెడతమన్నారు. ఈసందర్భంగా దేశానికి కాబోయే ప్రధాని మంత్రి రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా యావత్ తెలంగాణ ప్రజానీకం తరఫున హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు





## అమృత్ కాల్ లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం

### మొక్కలు నాటిన బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి

గోదావరిఖని(ఆకాంక్ష న్యూస్): వికసిత్ భారత్ అమృత్ కాల్ కార్యాచరణను ముందుకు తీసుకెళ్తూ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' ఉద్యమం ప్రేరణగా గోదావరిఖని పట్టణంలోని అడ్డగుంటపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. లక్ష్మీనగర్ మండల పరిధిలోని 58వ డివిజన్‌లో పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "తల్లి పేరు మీద ఒక మొక్కను నాటడం ద్వారా ప్రకృతి పట్ల ప్రేమను, బాధ్యతను చాటవచ్చు. ఇది భావోద్వేగాన్ని కలిగించే స్ఫూర్తిదాయక ఆలోచన" అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమితి కన్వీనర్ సిలారపు కళ్యాణ్ సమర్థంగా నిర్వహించారు. ప్రకృతిని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరికి పాత్ర ఉండాలంటూ, అందరూ తల్లి పేరుతో మొక్కలు నాటి వాటి సంరక్షణలో భాగస్వామ్యం కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు ముస్కుల భాస్కర్ రెడ్డి, కోడూరి రమేష్, పిడుగు కృష్ణ, లక్ష్మీనగర్ మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ, వాసవి క్లబ్ సభ్యులు రమేష్, కుక్కడపు మురళి, విష్ణు వర్ధన్ రెడ్డి, అందే రాజ్ కుమార్, దాసరి సుమలత, జక్కుల ఐలయ్య, గజ్జెల భాస్కర్, మాదరబోయిన రాకేష్, దండు సాయి పవన్, కూర్మ అరుంధతి, జక్కన బాలు, గుంపుల వంశీ, గంధం అజయ్, బుంగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## అంగన్వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలి

- అంగన్వాడీ కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రాధాన్యత అంశం...
- పూర్వ ప్రాథమిక విద్య పకడ్బందీగా అమలు చేయాలి...
- సంక్షేమ శాఖ పని తీరుపై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...



పెద్దపల్లి (ఆకాంక్ష న్యూస్) : అంగన్వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంక్షేమ శాఖ పని తీరు పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. అంగన్ వాడి కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్ లేని అంగన్ వాడి కేంద్రాల జాబితా సిద్దం చేసి వెంటనే టాయిలెట్స్ నిర్మించాలని, అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకుల సరిగ్గా పనిచేస్తే అంగన్వాడి కేంద్రాలకు ఎక్కువమంది పిల్లలు వస్తారని, పిల్లల హాజరు వివరాలను సూపర్వైజర్లు నిరంతరం మానిటరింగ్ చేయాలని అన్నారు. స్థానిక పంచాయతీకార్యదర్శులు, ఎంపిడిఓ లతో సమన్వయం చేసుకుంటూ అంగన్వాడి సెంటర్ లను శుభ్రం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రతి అంగన్వాడి సెంటర్ లో అవసరమైన పౌష్టికాహారం నిల్వలు, త్రాగు నీటి సరఫరా చెక్ చేసుకోవాలని అన్నారు. సూపర్ వైజర్లు ప్రతి రోజూ రెండు అంగన్ వాడి కేంద్రాలను తనిఖీ చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించడం యొక్క ప్రాముఖ్యత గురించి సిబ్బందికి అవగాహన కల్పించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు రాబోయే 6 నెలల కాలంలో అక్షరాలు, సంఖ్యల గుర్తింపు, రాయడం వంటి అంశాలలో పురోగతి రావాలని, పూర్వ ప్రాథమిక విద్య గురించి ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. పిల్లల ఎదుగుదల నిరంతరం మానిటరింగ్ చేయాలని అన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించాలని ఎక్కడ దాచాల్సిన అవసరం లేదని, సరైన రిపోర్ట్ లను అందించాలని అన్నారు.గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలకు సంబంధిత పౌష్టికాహారం తప్పనిసరిగా అందేలా చూడాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లల తల్లిదండ్రులతో ప్రతి నెలా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పెట్టి బరువు, ఎత్తు ఎంత ఉంది ,ఎటువంటి పౌష్టిక ఆహారం అందిస్తున్నాం, విద్య ఎలా అందుతుంది వాటి అంశాలను వివరించాలని కలెక్టర్ తెలిపారు.సఖీ సెంటర్ వద్ద సెప్టిక్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లల రికార్డులు పకడ్బందీగా మెయింటైన్ చేయాలని, అంగన్వాడీ తర్వాత వారు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఈ.ఎం.ఎస్ నేషనల్ ఒలింపియాడ్‌లో మెరిసిన గీతాంజలి విద్యార్థులు

### జాతీయ స్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించిన మొగురం వైష్ణవి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఇల్లందుల రాగమాలిక





గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : విద్యా రంగంలో మరోసారి గీతాంజలి విద్యాసంస్థలు ఘనవిజయం సాధించాయి. దేశవ్యాప్తంగా ప్రతిభా పాటవ పరీక్షలుగా నిర్వహించిన %ూజుమీ% నేషనల్ ఒలంపియాడ్ లో గీతాంజలి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ పోటీలో మొగురం వైష్ణవి జాతీయస్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించగా, ఇల్లందుల రాగమాలిక స్టేట్ ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకుంది. అలాగే, బూడిద లాస్య స్టేట్ 6వ ర్యాంక్, గాజుల స్ఫూర్తి జోనల్ 5వ ర్యాంక్, ఆరేపల్లి సాత్విక్ జోనల్ 3వ ర్యాంక్ సాధించారు.ఈ సందర్భంగా %ూజుమీ% నేషనల్ ఒలంపియాడ్ కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో మాట్లాడుతూ, "గీతాంజలి విద్యార్థులు చూపిన అద్భుత ప్రతిభ రాష్ట్ర స్థాయిని మించి దేశస్థాయిలో మారుమోగుతోంది. వారు కష్టపడి సాధించిన ఫలితాలు వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయని ఆశిస్తున్నాం," అన్నారు.విద్యార్థుల విజయం సందర్భంగా గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు వారిని ఘనంగా అభినందించారు. "మన పాఠశాల విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభ చూపుతూ ముందుకు సాగుతుండటం గర్వకారణం," అని కరస్పాండెంట్ వ్యాఖ్యానించారు.ఈ విజయాలతో విద్యార్థుల్లో కొత్త ఉత్తేజం నెలకొనగా, భవిష్యత్తులో మరింత ఎత్తులకు చేరేలా ప్రోత్సాహం లభిస్తుందని పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్ రెడ్డి పేర్కొన్నారు

## కరీంనగర్ జిల్లా నుంచి వారిద్దరూ సహా 15 మంది అరెస్టు...

### చిన్నపిల్లల పోర్న్ వీడియోలు షేర్ చేసిన కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దాడులు...




హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : చిన్నపిల్లల అసభ్యకర వీడియోలు, ఫొటోలు డౌన్‌లోడ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న ఘటనలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) పెద్ద ఎత్తున దాడులు నిర్వహించింది. కరీంనగర్, జగిత్యాల, వరంగల్, హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో 15 మందిని అరెస్ట్ చేసినట్లు టీఎస్‌సీఎస్‌బీ డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ తెలిపారు.ఈ అరెస్ట్‌లలో సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వ్యక్తులు కూడా ఉన్నట్టు వెల్లడించారు. బాధితులుగా కనిపించిన చిన్నపిల్లల వయసు 6 నుంచి 14 ఏళ్ల మధ్య ఉండటం విచారకరం అని ఆమె అన్నారు. చిన్నారులపై అసభ్యకర కంటెంట్‌ను పోస్ట్ చేయడం, షేర్ చేయడం తీవ్ర నేరంగా భావించబడుతుందని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారి మీద కఠినంగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.

### చట్ట ప్రకారం కఠిన శిక్షలు తప్పవు...

పిల్లలపై ఈ తరహా హింసాత్మక, అసభ్య కంటెంట్‌ను ఇంటర్నెట్‌లో పంచడం ఐటి చట్టం, పాక్సో (%ూరాజుూా%) చట్టం కింద తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. ఈ నేరాలకు కేవలం జరిమానాలు మాత్రమే కాకుండా, ఏళ్లపాటు జైలు శిక్షలు కూడా విధించబడే అవకాశం ఉంది.

### పోలీసుల నిర్బంధంలో... అరెస్టైన వారి వివరాలు....

కేసులో అరెస్టైన వారిని పూర్తిగా విచారిస్తున్నామని, మరిన్ని ఖచ్చితమైన ఆధారాలు సేకరించిన తర్వాత వారి వివరాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఈ నేరాల్లో పాల్గొన్న వారి గ్యాడ్జెట్లు, డిజిటల్ డివైసులు సీజ్ చేసినట్లు చెప్పారు.

### ప్రజలకు హెచ్చరిక....

సోషల్ మీడియా వేదికగా చిన్నపిల్లలపై అసభ్య కంటెంట్‌ను పంచే వారు ఎంతటి విద్యావంతులైనా, ఏ వృత్తికి చెందిన వారైనా సరే చట్టానికి లోబడి కఠిన చర్యలు తీసుకుంటామని శిఖా గోయల్ స్పష్టం చేశారు. ఇటువంటి విషయాలపై సమాచారం ఉన్నవారు వెంటనే పోలీసులను సంప్రదించాలని, పిల్లల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీరాంపూర్ మండలంలో అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



పెద్దపల్లి(ఆకాంక్ష న్యూస్) : శ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యంపై మాజీ ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు అభివృద్ధి పనుల్లో తహసీల్దార్, ఏఈఈ, ఎంపీడీఓ లు సహకరించక పోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.జూన్ 18వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు శ్రీరాంపూర్ మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి సంబంధించి పలు పనులు మంజూరైనా వాటిపై ఏఈఈ స్పందించకపోవడమే కాకుండా పనుల ప్రారంభానికి అనుమతులు ఇవ్వకపోవడం, సమన్వయం లేకుండా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు. పథకాలకు సంబంధించిన వివరాలు, ప్రతిపాదనలు ఉన్నా పరిశీలన లేకుండా నిర్లక్ష్యం చేస్తుండడాన్ని వారు తప్పుబట్టారు.ఇటీవలి కాలంలో శ్రీరాంపూర్ మండల అభివృద్ధి లోపించడానికి కారణం అధికారుల అలసత్వమేనని వారు విమర్శించారు. ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చినా సమయానికి అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడిందని, ప్రజా సేవలో ఇలాంటి నిస్సహకార ధోరణి హేయమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ సంపత్ కుమార్, మాజీ జెడ్పీటీసీ వి. మౌనిక, మాజీ సర్పంచ్ లు బీ. లక్ష్మయ్య, జి. నర్సయ్య, ఎస్. యాదయ్య, సీ. రాజు తదితరులు పాల్గొన్నారు. వారు అందరూ కలిసిన ఆందోళన స్వరాన్ని గౌరవ కలెక్టర్‌కు వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. వారి సంతకాలతో కూడిన విజ్ఞప్తిపత్రాన్ని అధికారులకు సమర్పించారు.పరిస్థితిని తక్షణమే గమనించి మండల అభివృద్ధిని కొనసాగించేలా అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# మహబూబాబాద్ జిల్లాలో పితృహత్య

## ప్రేమ వ్యవహారానికి అడ్డుపడిన తండ్రిని కొట్టి చంపిన కుటుంబ సభ్యులు...

### మరిపెడ మండలం జెండాల్ తండాలో కలకలం రేపిన సంఘటన...



**మహబూబాబాద్ (ఆకాంక్ష న్యూస్):** మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండలంలోని డీఎస్ఆర్ జెండాల్ తండాలో మానవత్వాన్ని మరిచిపోయే దారుణ ఘటన చోటు చేసుకుంది. కన్న కూతురి ప్రేమ వ్యవహారానికి అడ్డుగా నిలిచాడన్న కారణంతో ఓ తండ్రిని సొంత భార్య, కుమార్తెలు, కూతురి ప్రియుడు కలిసి దారుణంగా హత్య చేసిన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.మృతుడు ధారావత్ కిషన్ (40)కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె పల్లవి అదే తండాకు చెందిన భూక్య సురేశ్ అనే యువకుడితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండటాన్ని గమనించిన కిషన్, కుమార్తెను మందలించాడు. ఈ అంశంపై తండ్రి అంగీకరించకపోవడంతో పల్లవి ఆగ్రహించింది. ఈ నేపథ్యంలో కిషన్ భార్య కావ్య, కుమార్తెలు రమ్య, పల్లవి, పల్లవి ప్రియుడు భూక్య సురేశ్‌తో పాటు బోడ చందు, దేవేందర్ అనే ఇద్దరు యువకులు కలిసి కిషన్‌పై మంగళవారం దాడికి దిగారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కిషన్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గాయాలపాలైన కిషన్‌ను అతని తల్లి సాంకి వెంటనే మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే కిషన్ మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుడి తల్లి సాంకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దాడిలో పాల్గొన్న కిషన్ భార్య కావ్య, కుమార్తెలు రమ్య, పల్లవి, ఆమె ప్రియుడు భూక్య సురేశ్, బోడ చందు, దేవేందర్‌లపై హత్యారోపణలతో కేసు నమోదు చేసినట్టు మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆవేదన కలిగించింది. ప్రేమ వ్యవహారాల పేరుతో కుటుంబ సభ్యులే ఈ స్థాయిలో దారుణానికి పాల్పడటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం కలకలం

## బిల్లులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర నిరసనకు దిగిన గడ్డం శ్రీనివాస్...



**నిర్మల్(ఆకాంక్ష న్యూస్) :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజూర గ్రామంలో శుక్రవారం ఉదయం విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ నిర్మించిన పాఠశాల భవనానికి బిల్లులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు .శ్రీనివాస్ స్వగ్రామమైన రాజూర్లో రూ.37 లక్షల అంచనాతో పాఠశాల భవనాన్ని నిర్మించాడు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.14 లక్షలు మాత్రమే విడుదల చేసింది. అయితే అనంతరం ఎన్నికల ప్రస్తుత నియమావళి అమలులోకి రావడంతో మిగిలిన బిల్లుల జారీ నిలిచిపోయాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయకపోవడంపై శ్రీనివాస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు.ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాల భవనానికి తాళం వేసిన శ్రీనివాస్, తనపై పెట్రోల్ పోసుకుని ఆందోళనకర చర్యకు దిగాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న గ్రామస్తులు, పోలీసులు హుటాహుటిన స్పందించి అతన్ని తప్పించారు.ఆందోళన విరమించిన కాంట్రాక్టర్, స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఒక వారం గడువు ఇచ్చాడు. తగిన చర్యలు తీసుకుని తనకు బిల్లు మంజూరు చేయకపోతే, మళ్లీ పాఠశాల భవనానికి తాళం వేస్తానని స్పష్టంగా హెచ్చరించాడు.ఈ ఘటన గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టర్లు నిర్మాణ పనులకు నిధులు ఖర్చు చేసి, బిల్లుల కోసం ఇలాటి పరిస్థితులు ఎదుర్కోవాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పరస్పర బాధ్యతారాహిత్యం కారణంగా ప్రభుత్వ నిర్మాణ పనులు నిలిచిపోతున్న వైనం మరోసారి బయటపడింది.

# గొర్రెల మృతి ఘటనపై స్పందించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

## ధర్మారం మండలంలో బాధితులను పరామర్శించిన బీఆర్ఎస్ నేత...



**పెద్దపల్లి(ఆకాంక్ష న్యూస్) :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని చామనపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో 52 గొర్రెలు మృతి చెందిన ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ స్పందించారు. గురువారం ఆయన సంఘటన స్థలాన్ని సందర్శించి, బాధిత గొర్రెకాపరుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, “బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల మృతి వంటి ఘటనలు జరిగితే, తక్షణమే ప్రభుత్వ స్కీముల ద్వారా నష్టపరిహారం అందించేవారు. చనిపోయిన ప్రతి గొర్రెకు నష్టపరిహారంగా ప్రభుత్వం డబ్బులు చెల్లించే విధంగా సదుపాయం ఉండేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తోంది” అని ఆరోపించారు.బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. “ఈ స్కీమ్ కొనసాగించి, వెంటనే ప్రతి గొర్రెకు పరిహారం ప్రకటించాలి. ఇదే రైతు సంక్షేమం అని చెబుతున్న ప్రభుత్వానికి సరైన పరీక్ష” అని ఈశ్వర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాధిత కుటుంబాల పరిస్థితిని దగ్గర నుంచి గమనించిన ఈశ్వర్, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమానికి దిగుతామంటూ హెచ్చరించారు.గ్రామస్థులు మాట్లాడుతూ, విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద లోపాలున్నాయని ఆరోపిస్తున్నారు. మృత గొర్రెలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# శ్రీరాంపూర్ మండల కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా పుట్టినరోజు వేడుకలు



**పెద్దపల్లి(ఆకాంక్ష న్యూస్) :** ప్రభుత్వ కార్యాలయం పరిపాలనా కేంద్రంగా ఉండాల్సిన సమయంలో, శ్రీరాంపూర్ మండల అభివృద్ధి కార్యాలయం (ఎంపీడీఓ ఆఫీస్) ప్రైవేట్ వేడుకలకు వేదికగా మారింది. నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా, మండల పంచాయతీ ఇంజినీర్ (%ూజుజు%) పుట్టినరోజు వేడుకను జూన్ 18న మధ్యాహ్నం అధికారికంగా జరిపినట్లు సమాచారం.ఈ వేడుకను ఎంపీడీఓ ఆధ్వర్యంలో, ప్రభుత్వ నిధులు ఉపయోగించి, కార్యాలయంలోనే నిర్వహించారని స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు తీవ్రంగా ఆరోపించారు. ఆఫీసు సిబ్బంది సమక్షంలో, పుష్పగుచ్ఛాలు, కేక్ కట్ చేయడం, ఫోటోలు దిగడం వంటి కార్యక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రజాసేవకు కేటాయించాల్సిన సమయాన్ని, ప్రైవేట్ వేడుకలకు వినియోగించడం ప్రజా ద్రోహమేనంటూ వారు మండిపడ్డారు.అధికారిక వేదికలను వ్యక్తిగత వేడుకలకు వాడటం ప్రభుత్వ నియమావళికి పూర్తిగా విరుద్ధమని, ఇటువంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా ఆహ్వానం లభించిన కొంతమంది పార్టీ అనుకూల నేతలతో కలిసి అధికారుల ఈ వేడుకను నిర్వహించడాన్ని రాజకీయ పక్షపాతంగా అభివర్ణించారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులపై విచారణ జరిపి, క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని వారు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు సిద్ధమవుతున్నారు. మండల అభివృద్ధి కార్యాలయాన్ని రాజకీయ కార్యకలాపాల వేదికగా మార్చడం బాధాకరమని, ప్రభుత్వ నైతికతకు ఇది మచ్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



# రామగుండం నగర పాలక సంస్థలో నీటి సరఫరాకు అంతరాయం

**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** మిషన్ భగీరథ మూర్మ్యాల్ పంప్ హౌజ్ మోటార్లలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని నల్లాల ద్వారా జరిగే నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు అధికారులు ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇచ్చారు.ఈ నెల 20.06.2025 తేదీ ఉదయం 10 గంటల నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలు తగినంత మోతాదులో నీటిని నిల్వ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కావున అదేరోజు ఉదయం 10 గంటల తరువాత నీటి సరఫరా నిలిపివేయబడిన ప్రాంతాలకు మళ్లీ 21.06.2025 తేదీ ఉదయం నుంచి యథావిధిగా సరఫరా పునఃప్రారంభం అవుతుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలు సహకరించాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ కోరారు.

# మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులకు ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



**హైదరాబాద్.** బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అమెరికాలో దిగ్విజయంగా నిర్వహించి అమెరికా పర్యటన ముగించుకొని, నేడు స్వదేశానికి తిరిగి వస్తున్న వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ %ం% భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి శ్రీ గండ్ర జ్యోతి గారు మరియు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి గార్లకు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లో ఘన స్వాగతం పలికిన శాయంపేట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో మెతుకు తిరుపతిరెడ్డి, గంగుల మనోహర్ రెడ్డి,రామ్ శెట్టి లక్ష్మారెడ్డి, వంగల నారాయణరెడ్డి, గంట శ్యాంసుందర్ రెడ్డి, దాసి శ్రావణ్ కుమార్, మేకల వెంకటేశ్వర్లు, సావుళ్ల కిష్టయ్య,మారెపల్లి నందం, ఎండి మొహిబుద్దీన్, దైనంపల్లి కరుణ్ బాబు, నర్ర రాజు, దైనంపల్లి సుమన్, మారెపల్లి మోహన్, గాదె రాజేందర్, గడిపే విజయ్, రంగు మహేందర్, కొమ్ముల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా రవాణా చేస్తున్న ఆటో పట్టివేత ఇద్దరు అరెస్ట్



ఈరోజు పరకాల ఎక్సయిజ్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూరు మండలం కటాక్షపూర్ వద్ద రూట్ వాచ్ నిర్వహించి నందిగామ రేలకుంట నుండి ఆత్మకూరు మండలం లోనికి ఆటో లో గుడుంబా రవాణా చేస్తున్న భూక్యా సుజాత, భూక్యా జగన్ అనే ఇద్దరిని అరెస్ట్ చేసి ఆటో, (15) లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ రూట్ వాచ్ లో పాల్గొన్న వారు సులోచన కాన్స్టేబుల్స్ : శ్రీనివాస్, విజయ్ కుమార్, దిలీప్ పాల్గొన్నారు

# శ్రీ రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలు




కాంగ్రెస్ పార్టీ & లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలు కాశిబుగ్గ జంక్షన్ లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ గారు ముఖ్య అతిథిగా హాజరై కేక్ ను కట్ చేసారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు శ్రీయుతులు గుండేటి నరేంద్ర గారు, బస్వరాజు శిరీషా శ్రీమాన్ గారు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్ , వరంగల్ తూర్పు అధ్యక్షులు సలీం,కుసుమ వరుణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోరంట్ల రాజు, మాజీ కార్పొరేటర్లు తత్తరీ లక్ష్మణ్, జన్ను అరుణ్, జన్ను రవి, దూపం సంపత్ ,దామెర సర్వేషం ,బిళ్ళ శ్రీకాంత్ ,సీనియర్ నేతలు శ్రీయుతులు సేవాదళ్ రాంసింగ్,కరాటే ప్రభాకర్, %వీఎ%. సాదిక్,జహర్,అందె సునీల్, అరెల్లి రవి,వసకుల ఉదయ్,దేవులపల్లి మోహన్, రాముల బాబూ, గుండేటి కమలాకర్, గుండేటి సతీష్, చిరంజీవి, దామోదర్,తోట బాలరాజు, జన్ను శ్యామ్ వేణు,ఇమ్రాన్,వెల్దండి వరుణ్, క్యాతం వేణు, జన్ను శ్యామ్,పెండ్యాల కొమురయ్య, గజ్జెల లింగమూర్తి, కొమ్ము రాజ్ కుమార్, రాచర్ల కుమార్, బుర్ర నటరాజ్, ఉమేందర్, బండ్ల సురేందర్,శేఖర్, సిరిసిల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల అనివార్య కారణాలవల్ల మృతి చెందినటువంటి వీర జవాన్ మైలారం గ్రామ వాస్తవ్యులు అరకిళ్ల ప్రవీణ్ గారి మృతి పట్ల సంకల్ప సభలో వారి యొక్క ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం వహించి సంతాపం తెలియజేయడం జరిగింది అదేవిధంగా వారి యొక్క పార్థివదేహానికి బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ నాగపురి రాజమౌళి గౌడ్ పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది . వారి వెంట బిజెపి నాయకులు ఉన్నారు

# వికసిత్ భారత్ సంకల్ప సభ ఘనంగా నిర్వహణ



ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, భారతదేశం యొక్క అభివృద్ధి ప్రస్థానాన్ని ప్రతిబింబిస్తూ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శాయంపేట మండలంలోని మైలారం గ్రామంలో లివికసిత్ భారత్ సంకల్ప సభ ను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ నాగపూరి రాజమౌళి గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ......

గత 11 సంవత్సరాల లో సేవా సుపరిపాలన మరియు పేదల సంక్షేమార్గంలో ప్రధాని నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో భారత్ ప్రతి సవాలను ధైర్యంగా ఎదుర్కొంది మన సైనికుల సాహసంతో సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయి ప్రపంచంఅనిచ్చిత్త పరిస్థితుల్లో ఉన్నప్పటికీ భారత్ అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదుగు ఎదుగుతుందని లిసబ్కా సాత్ సబ్కా వికాస్ మరియు లిసబ్కా ప్రయత్న్ సబ్కా విశ్వాస్ అనే మంత్రంతో ప్రతి పౌరుడిని అభివృద్ధి బాటలోకి తీసుకొచ్చారని దేశం మొత్తం వికసిక్ భారత్ లక్ష్యం వైపు చేరుకునే దిశగా ఏకతాటిపై ముందుకు వెళుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో భారత రక్షణ ఎగుమతులు 34 రెట్లు పెరిగి రూపాయలు 23.622 కోట్లకు చేరాయి ప్రచండ హెలికాప్టర్, ఆకాష్ క్షిపణి వ్యవస్థ, బ్రహ్మోస్ వంటి స్వదేశీ తయారుచేసిన ఆయుధాలను సైనికులు విజయవంతంగా వినియోగించారు ఇటీవల ఆపరేషన్ సింధూర్ లో భాగంగా భారత సైనిక దళాలు ఆక్రమిక కాశ్మీర్ (పిఓకే) మరియు పాకిస్తాన్ ప్రాంతంలో 9 ఉగ్రవాద శిబిరాలు 11 ఎయిర్ బేస్ లను ధ్వంసం చేయడం జరిగిందని గత 11 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, పేదల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలను, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉపాధి, ఆరోగ్యం, విద్య, రోడ్డులు తదితర రంగాలలో సాధించిన పురోగతిని,దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్గా మార్చే దిశగా మోదీ గారి దృఢ సంకల్పాన్ని వివరించారు.ప్రజల మద్దతుతో నూతన భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని, గ్రామీణ ప్రాంతాలలో అవగాహన పెంచేందుకు ఈ సభలు ముఖ్యపాత్ర వహిస్తాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు తాటికొండ రవికిరణ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు యువ మోర్చా జిల్లా కార్యదర్శి లడే శివ, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్, పోల్ మహేందర్, మంద సురేష్ మండల కోశాధికారి కుక్కల మహేష్, బూత్ అధ్యక్షులు, కన్నెబోయిన రమేష్, నూనె వెంకటేష్ కడారి చంద్రమౌళి, బాసాని నవీన్, బత్తుల రాజేష్, ఎర్ర తిరుపతిరెడ్డి, కుక్కల సతీష్, మూడేడ్ల పైడి, మందమదు, చెక్క దినేష్,%ఒ% రాజు,కుక్కల రమేష్, ఆకుతోట భాను, మూడేళ్ల రాంప్రసాద్ మోతె విక్రం, జక్కుల ఓదెలు, సిరిపురం కొమురయ్య, కౌటాం శివ, శ్రీరాముల తిరుపతి, సిరిపురం మహేందర్ మరియు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# "ఒగ్గుకళా వికాసం-భవిష్యత్ ప్రణాళిక" సదస్సు మరియు ఒగ్గు కథ మహోత్సవం



ఆకాంక్ష : ఈరోజు మాజీ ఉపముఖ్యమంత్రివర్యులు, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు, పెద్దలు కడియం శ్రీహరి గారిని వారి స్వగృహం లో కలవడం జరిగింది. దివి:25/06/2025 బుధవారం రోజున జనగామ జిల్లా ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే "ఒగ్గుకళా వికాసం-భవిష్యత్ ప్రణాళిక" సదస్సు మరియు ఒగ్గుకథ మహోత్సవానికి రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి వర్యులు స్టేషన్ గణపురం శాసనసభ్యులు శ్రీ కడియం శ్రీహరి గారిని ఆహ్వానించడం జరిగింది.. ఇందులో భాగంగా రాష్ట్ర ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒగ్గు ధర్మయ్య గారు మరియు ఒగ్గు రవి గారు, రాష్ట్ర ముఖ్య సలహాదారుడు రోశయ్య గారు, రాష్ట్రకార్యదర్శి మధు, బీర్ల జంగయ్య గారు, జనగామ జిల్లా కురుమ సంఘ ప్రధాన కార్యదర్శి జాయ మల్లేశం కురుమ గారు ఒగ్గు బీర కళాకార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వీరస్వామి గారు గౌరవాధ్యక్షులు జూకాంటి తిరుపతి , లింగాలగణపురం మండల అధ్యక్షులు బంద్రు సత్తయ్య గారు,కోశాధికారి బండి ప్రవీణ్ గారు, జూకంటి రాజుగారు, ప్రచార కార్యదర్శి బర్ల అనిల్ కుమార్ గారు చౌదర్పల్లి ఎల్లయ్య గారు, దావర ప్రవీణ గారు, ఒగ్గు యాదగిరి ఇబ్రహీంపురం కడకంచి పరశురాముడు గారు బీదని భరత్ కార్యదర్శులు ఇతర కళాకారులందరూ పాల్గొనడం జరిగింది...

# వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సుగుణమ్మ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

## లియంసిపీఐ(యు)జాతీయ కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్..



శేరిలింగంపల్లి ప్రతినిది : మియాపూర్ లో ప్రశాంత్ నగర్ వారి నివాసంలో యంసిపిఐ (యు )పార్టీ రాష్ట్ర నాయకత్వంతో కలిసి ఆమెకు నివాళు లర్పించారు తదంతరం యంసిపీఐ(యు )జాతీయ కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ సుగుణమ్మ తన 15 వ ఏటనే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొంది. నాడు సాగిన దొరలు, భూస్వాములు, పెత్తందార్ల వెట్టిచాకిరి కి వ్యతిరేకంగా బాంచన్ కాల్మొక్తా అనే సామాన్య ప్రజల చే ఆయుధం పట్టించి ఆత్మగౌరవ పోరాటం నిర్వహించి పది లక్షల ఎకరాల భూమిని పంచి , మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాల ఏర్పాటు చేసిన మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రధాన భూమిక పోషించిన నాయకత్వం యొక్క రక్షణ కేంద్రం నిర్వహణ సభ్యురాలు గా ఉండి అనేక సాహస కార్యక్రమాలకు నేతృత్వం వహించిన సుగుణమ్మ కుటుంబం యావత్తు సాయుధ పోరాటవారసత్వం కావటం.ఆ పోరాటంలో అగ్రశ్రేణి పాత్ర నిర్వహిస్తూ ఉన్న కామ్రేడ్ శాఖమూరి వెంకట కృష్ణ ప్రసాద్ ( యస్ వి కే ప్రసాద్) గారిని 1949 లో పోరాట సందర్భంగా నే వివాహం చేసుకున్న వీరు పోరాట విరమణ తరువాత ప్రజా ఉద్యమాల్లో కీలకమైన పాత్ర నిర్వహించారు. శాసనసభ ఎన్నికలలో చెన్నూరు నియోజకవర్గం నుంచి కామ్రేడ్ యస్ వి కే ప్రసాద్ గెలుపొందడం ఆనాటి ఉద్యమ నేతలను ప్రజలు అక్కున చేర్చుకున్న తీరు అమోఘం.1984 ఫిబ్రవరి 18 వ తేదీన వరంగల్ నగరంలో చారిత్రాత్మక మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ( యంసిపి) ఆ తర్వాత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ( యంసిపిఐ) ఏర్పాటు లో వ్యవస్థాపక కామ్రేడ్ సుగుణమ్మ నాటి ఐక్య మహిళా సమాఖ్య తొలి అధ్యక్షురాలు గా బాధ్యతలు నిర్వహిస్తూ 1984 ఆగష్టు మాసంలో నాటి ఉమ్మడి ముఖ్యమంత్రి గా ఉన్న యన్ టి రామారావు ప్రభుత్వం ను నాటి నాదెండ్ల భాస్కరరావు ను అడ్డుపెట్టుకుని గవర్నర్ వ్యవస్తను దుర్వినియోగం చేసి రాంలాల్ అనే గవర్నర్ తో ప్రభుత్వం కూల్చివేత కు పాల్పడగా పార్టీ పిలుపు నందుకొని సాగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలో పార్టీ రాష్ట్ర కేంద్ర నాయకురాలు గా కామ్రేడ్ సుగుణమ్మ ప్రభుత్వ పునరుద్ధరణ వరకు సాగిన పోరాటం లో మహిళలందరి ని సమీకరించి ఉద్యమించారు. ఇలా ప్రజా ఉద్యమాలలో సముచిత పాత్ర నిర్వహించిన సుగుణమ్మ జూన్ 16 వ తేదీన రాత్రి మరణించటం పట్ల యంసిపిఐ(యు) ప్రధాన నాయకత్వం విప్లవ జోహార్లు అర్పించారు.సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ కే.నారాయణ తో కలిసి నివాళులర్పించిన వారిలో యంసిపీఐ(యు) పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గదాగోని రవి, కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, పస్కుల మట్టయ్య, గోనె కుమార స్వామి, ఏ.హంసారెడ్డి, పెద్దాపురం రమేష్, తుకారం నాయక్, మంద రవి,కే సుకన్య, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్, తాండ్ర కళావతి, ఇస్లావత్ దశరథ్ నాయక్,పి భాగ్యమ్మ, కర్ర దానయ్య, బి విమల, శివాని తదితరులు ఉన్నారు.

# సోషల్ మీడియాలో అశ్లీల, అపవాదులు గల అవాస్తవమైన పోస్టు పెడుతున్న వారి పై చర్యలు తీసుకోవాలని పిర్యాదు

శేరిలింగంపల్లి ప్రతినిధి.. గురువారం రోజు తెలంగాణ ప్రదేశ్ యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో-కన్వీనర్ దుర్గం శ్రీహరి గౌడ్, శేరిలింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ నేతలు శ్రీ శేఖర్ రెడ్డి, సౌందర్య రాజన్,సాంబశివ రావు,సంగారెడ్డి, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ దోర్నాల రవికుమార్ ,శివ,నర్సింగ్ కలిసి, సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి శ్రీ మేడంను గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో, సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలో, ముఖ్యంగా (పూర్వపు ట్విట్టర్)లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని లక్ష్యంగా చేసుకొని అవాస్తవమైన, అశ్లీలమైన, అపవాదులు గల సమాచారం ప్రచారం చేస్తున్న ఖాతాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాలు ప్రజల అభిప్రాయాలను వ్యక్తపరచుకునే వేదికలు మాత్రమే కానీ, వాటిని అబద్ధపు ప్రచారానికి, ప్రజలను తప్పుదారి పట్టించే కుట్రలకు వాడటం మానుకోవాలని కోరుతున్నాం. కాంగ్రెస్ నేతలపై పోస్టులు చేసే ముందు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని గట్టిగా హెచ్చరిస్తున్నాం .జనాభిమతాన్ని గౌరవించాలి వ్యక్తిగత దూషణలను ప్రోత్సహించకూడదు అని వారు ఈ సందర్భంగా తెలిపారు.



# బైక్ యాక్సిడెంట్ అయి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వారి వైద్యానికి ఆర్థిక సహాయం అందజేసిన ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి



ఆకాంక్ష : జయశంకర్ భూపాలపల్లి జిల్లా: గణపురం మండలం: మైలారం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దసరాపు భద్రయ్య కు మరియు ముత్యాల సంపత్ కు ఇటీవల బైక్ ఆక్సిడెంట్ కావడం జరిగింది దీనితో వారికి తలకు మరియు బాడీకి తీవ్రమైన దెబ్బలు తగలడంతో హైదరాబాదులోని హాస్పిటల్కు తీసుకువెళ్లడం జరిగింది వారిది నిరుపేద కుటుంబం కావడంతో వారి కుటుంబం దాతల సహకారం కోరగా విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి గారు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్నికి మనోధైర్యం కల్పించి వారి వైద్యానికి 5,000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది అలాగే వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటారని భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఇంచార్జ్ ఆకుల ప్రతాప్,మొర్రి గణేష్, మరియు తది ఇతర సభ్యులు పాల్గొన్నారు

# మాజీ జడ్పీటిసి పరామర్శ




శాయంపేట.. భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి గారు మరియు వరంగల్ రూరల్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ %ఒ% బిఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి శ్రీ గండ్ర జ్యోతి గార్ల ఆదేశానుసారం. శాయంపేట మండలం మైలారం గ్రామ మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్ గారి సోదరుడు కీఎఐశేఎఎ అరికిళ్ల ప్రవీణ్(ఆర్మీ జవాన్) గారు నిన్న మరణించగా విషయం తెలుసుకున్న శాయంపేట మాజీ జడ్పీటీసీ వంగాల నారయణరెడ్డి గారు నేడు వారి స్వగృహానికి వెళ్లి ప్రవీణ్ గారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి అంతిమయాత్రలో పాల్గొన్నారు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ. వారి కుటుంబానికి భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలన కోరుతూ.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పిఏసియస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దైనంపెల్లి సుమన్,మాజీ యంపిటిసి గడిపే విజయ్ ,గాజె రాజేందర్,రంగు మహేందర్,కోమ్ముల సంతోష్ .బగ్గీ రమేష్ సుమన్,నూనె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# శాయంపేట పిఎసిఎస్ ఎదుట పురుగుల మందు డబ్బాలతో నిరసన



హనుమకొండ జిల్లా శాయంపేట పిఎసిఎస్ లో ఇన్చార్జి సీఈఓ గా పనిచేస్తున్న శంకర్ అనే వ్యక్తి తమ వద్ద నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడు అంటూ శాయంపేట పిఎసిఎస్ ఎదుట పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలిపారు శాయంపేట మండలం పెద్దకోడపాక గ్రామానికి చెందిన కోకిల సదానందం రేణిగుంట్ల పృథ్వీరాజ్ కొమ్ము నరేష్ గతంలో పిఎసిఎస్ లోన్ తీసుకున్నారు అయితే ప్రభుత్వం రుణమాఫీ చేసిన తరుణంలో అందరి రుణాలు మాఫీ అయ్యాయి. పిఎసిఎస్ లో పనిచేస్తున్న శంకర్ తమకు ఇంకా వడ్డీ చెల్లించాలని 10000 రూపాయలు అదనంగా వసూలు చేశాడని అలాగే కొత్త లోన్లు ఇప్పిస్తానని పృథ్వీరాజ్ వద్ద 25వేల రూపాయలు ఆత్మకూరు పోలీస్ స్టేషన్ సమీపంలో వసూలు చేశాడని ఆరోపించారు. 50 వేల లోన్ తీసుకుంటే ప్రస్తుతానికి 90 వేల లోన్ ఉన్నట్లు తెలిసిందని ఎలాగైనా తమకు న్యాయం చేయాలంటూ పిఎసిఎస్ ఎదుట మంగళవారం రైతులు పురుగుల మందు డబ్బాలతో ఆందోళన చేపట్టారు పై అధికారులకు తమ సమస్యను విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పి పోలీస్ స్టేషన్ కి తరలించారు ఎలాగైనా తమకు న్యాయం చేసే దిశగా అధికారులు చొరవ చూపాలని వేడుకున్నారు

# రాహుల్ గాంధీ గారి జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో 130 మంది విద్యార్తిని, విద్యార్థులకు సుమారు 9000 రూపాయలు విలువగల నోట్ బుక్ లను పంపిణీ




ఆకాంక్ష : ప్రియతమ నేత భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ గారి జన్మదినం సందర్భంగా జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోనాసి క్రాంతి.కుమార్ గారి ఆధ్వర్యంలో రఘునాథపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 130 మంది విద్యార్తిని, విద్యార్థులకు సుమారు 9000 రూపాయలు విలువగల నోట్ బుక్ లను పంపిణీ చేయడం జరిగింది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల.రవి గౌడ్ ఆధ్వర్యంలో జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మారుజోడు.రాంబాబు గారు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగాల.జగదీశ్ చందర్ రెడ్డి గారు మండల పార్టీ అధ్యక్షులు కోళ్ల.రవి గౌడ్ మండల మాజీ ఎంపీపీ మేకల.వరలక్ష్మి.నరేందర్, మాజీ జెడ్పిటిసి సభ్యులు బొల్లం.అజయ్ మణికంఠ, %గూజా% ఛైర్మెన్, అయిత.జయారాములు మాజీ సర్పంచ్ పోకల శివకుమార్, జిల్లా సీనియర్ నాయకులు గాదె. మహేందర్ రెడ్డి,గుగులోత్.కొమురెల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తోటకూరి రమేష్ యాదవ్ ,భాష్మీయ,పరిష.సిద్దయ్య,కొయ్యాడ.ప్రభాకర్, కొలిపాక.మల్లేష్,పురుషోత్తం,జిల్లా యువజన నాయకులు లోనే.శ్రవణ్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇబ్రహీం పాషా, గ్రామ పార్టీ అధ్యక్షులు కడారి.రవి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ హరీష్.చీటకోయిల, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మున్నీర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మంగు.రామకృష్ణ, మండల యువజన నాయకులు జాని, రాకేష్, యాకూబ్, విక్రమ్, శేఖర్, అశోక్, మహేష్, కార్తీక్, రాజు, అరవింద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..!!